

లైఫ్ సర్టిఫికెట్‌కు నేడు ప్రత్యేక శిబిరాలు

ఏలూరుసిటీ, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): పింఛన్‌దారులు లైఫ్ సర్టిఫికెట్ సమర్పణ, క్రమబద్ధీకరణకు బుధవారం ప్రత్యేక శిబిరాలు నిర్వహించనున్నారు. నగరంలోని సీఆర్‌ఆర్ కళాశాల, సెయింట్ థెరిస్సా కళాశాల, అశోక్‌నగర్, ఆర్‌ఆర్‌పేట యూనియన్ బ్యాంక్ వద్ద శిబిరాలు, జరుగుతాయని లీడ్ బ్యాంక్ మేనేజర్ డి.నీలాద్రి మంగళవారం తెలిపారు. లైఫ్ సర్టిఫికెట్ సమర్పించే ప్రక్రియలో ఆధార్, మొబైల్, పీపీవో, బ్యాంక్ / పోస్టాఫీస్ ఖాతా వివరాలు అవసరమన్నారు.

వాతావరణం

బంగాళాఖాతంలో అల్పపీడనం.. జిల్లా వ్యాప్తంగా వర్షాలు


వట్లూరు వద్ద పంట పొలాల్లో ఆరబెట్టిన ధాన్యం

బంగాళాఖాతంలో అల్పపీడన ద్రోణి రైతులను పరుగులు పెట్టించింది. పంట చేతి కొచ్చే సమయంలో వస్తున్న ప్రకృతి వైపరీత్యాలతో రైతులు నష్టపోతున్నారు. రానున్న 24 గంటల్లో ఉత్తర కోస్తాలో వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ హెచ్చరిక, జిల్లాలో మంగళవారం మబ్బుల వాతావరణం రైతులను కంగారు పెట్టింది. వర్షాల బారిన పడకుండా రైతులు పంట రక్షించుకునే ప్రయత్నాలు చేస్తున్నారు. మాసూళ్లు రెండు మూడు రోజులు వాయిదా వేయాలని వ్యవసాయ శాఖ అధికారులు సూచిస్తున్నారు.

- మబ్బులు, చిరుజల్లులతో రైతులు ఉరుకులు, పరుగులు
- పంట కాపాడుకునే ప్రయత్నాలు
- 24 గంటల్లో భారీ వర్ష సూచన
- వాతావరణ శాఖ హెచ్చరిక
- మాసూళ్లు వాయిదా వేయాలని రైతులకు అధికారుల సలహా


కైకలూరు మండలం తామరకొల్లులో నేలకొరిగిన వరి

ఏలూరుసిటీ, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): సార్వా ఆరంభం నుంచి రైతులు ప్రతికూల వాతావరణంతో నష్టపోయారు. నారుమడులు, నాట్ల సమయంలో భారీ వర్షాలకు రైతులు కొంత నష్టపోయారు. ప్రస్తుతం పంట చేతి కొచ్చే సమయంలో మబ్బుల వాతావరణంతో రైతుల్లో గుబులు మొదలైంది. సార్వా సాగులో ఆశించిన దిగుబడులు వస్తాయని భావిస్తున్న తరుణంలో వర్షాలు ముంచుతాయని రైతులు భయపడుతున్నారు. వర్షాల నుంచి ధాన్యం కాపాడుకోడానికి రైతులు బస్తాలు, బరకాలు సిద్ధంగా ఉంచుకోవాలని వ్యవసాయ శాఖాధికారులు సూచించారు. వరి కోతలు ఈ నెల 15 వరకు వాయిదా వేసుకోవాలని, ఆరబెట్టుకున్న ధాన్యాన్ని సురక్షిత ప్రాంతాల్లో నిల్వ చేయాలని సూచించారు.

జిల్లాలో జోరుగా మాసూళ్లు

జిల్లాలో వరి మాసూళ్లు జోరుగా సాగుతున్నాయి. మబ్బులతో కూడిన వాతావరణంలో కళ్లాలపై ధాన్యం రక్షించుకోడానికి రైతులు పాట్లు పడుతున్నారు. ప్రస్తుతం భీమడోలు, ఉంగుటూరు, దెందులూరు, నిడమర్రు మండలాలతో పాటు ఏలూరు రూరల్ మండలంలో వరి కోతలు ముమ్మరంగా సాగుతున్నాయి. రహదారులపై ఆరబెట్టుకుంటున్న తరుణంలో వర్షాలు కురిస్తే పంట పూర్తిగా తడిసి పోతుందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మంగళవారం రైతులు కోసిన వరిని కుప్పలుగా వేసి టార్పాలిన్‌లు కప్పుతున్నారు. కొంతమంది వ్యవసాయ శాఖాధికారుల సూచనలతో వరి మాసూళ్లను వాయిదా వేసుకున్నారు. కళ్లాల్లో ధాన్యాన్ని సురక్షిత ప్రదేశాలకు తరలిస్తున్నారు. ఆరబెట్టిన ధాన్యాన్ని కూడా సంచులతో నింపి వాటిని కూడా సురక్షిత ప్రదేశాలకు తరలిస్తున్నారు. జిల్లాలో వాతావరణ హెచ్చరికలతో రైతులు వరి కోత కార్యక్రమాలను కొన్ని రోజులు వాయిదా వేసుకుంటున్నారు.

నాలుగు వేల హెక్టార్లలో పూర్తి

జిల్లాలో ఇప్పటివరకు 4144.4 హెక్టార్లలో వరి మాసూళ్లు పూర్తయ్యాయి. ఫైన్ వెరైటీ 803 హెక్టార్లు, కామన్ వెరైటీ 3341.4 హెక్టార్లలో మాసూలు పూర్తయింది. వేలేరుపాడు, కుక్కునూరు, టి.నరసాపురం, ఏలూరురూరల్, ఆగిరిపల్లి మండలాల్లో మాసూళ్లు ఇంకా చేపట్టలేదు. ఉంగుటూరు మండలం 1558 హెక్టార్లు, ద్వారకాతిరుమల మండలంలో 817 హెక్టార్లు, చాట్రాయి మండలంలో 364 హెక్టార్లు, జంగారెడ్డిగూడెం మండలంలో 266 హెక్టార్లు, దెందులూరు మండలంలో 160 హెకార్లు, భీమడోలు మండలంలో 120 హెక్టార్లు, కొయ్యలగూడెం మండలంలో 263 హెక్టార్లు, పెదపాడు మండలంలో 118.4 హెక్టార్లలో వరి మాసూళ్లు పూర్తయ్యాయని జిల్లా వ్యవసాయ శాఖ నివేదికలు చెబుతున్నాయి. ఇదిలా ఉండగా మిగిలిన ప్రాంతాల్లో కూడా మాసూళ్లు ఊపందుకుంటున్న తరుణంలో భారీ వర్షాలు కురిస్తే వరి పంట పూర్తిగా దెబ్బతింటుందని రైతులు వాపోతున్నారు.

కైకలూరులో భారీ వర్షం

● కైకలూరు, పెదపాడు, చాట్రాయి, చింతలపూడి: వాతావరణం రైతులతో దోబుచూలాడుతోంది. కైకలూరు మండలంలోని పలు గ్రామాల్లో భారీ వర్షం పడింది. తామరకొల్లు, వేమవరప్పాడు గ్రామాల్లో ముమ్మరంగా వరి కోతలు నిర్వహిస్తున్నారు. ఆకస్మిక వర్షంతో పనలపై ఉన్న పంట తడిసిపోయింది, వందలాది ఎకరాల్లో పంట నేలకొరిగింది. రైతులు దిక్కుతోచక ఎక్కడి పనలు అక్కడే వదిలివేశారు పెదపాడు మండలంలో యంత్రాలతో వరి మాసూళ్లు ముమ్మరంగా సాగుతున్న వేళ రైతులు వర్షం నుంచి పంట కాపాడుకునే ప్రయత్నాలు చేస్తున్నారు. ఎంటీయూ 1318 రకం వరి చేలు గింజ పాలుపోసుకుని గట్టిపడే దశలో ఉంది. మరో రెండు వారాల్లో ఈ రకం పంట కోతకొచ్చే అవకాశం ఉంది. ఎంటీయూ 7029 (స్వర్ణ) రకం ఎకరానికి 35-40 బస్తాలు, సంపద స్వర్ణ 33-35 బస్తాల దిగుబడులు వస్తాయని, దీనికి వాతావరణం కూడా అనుకూలించాలని రైతులు చెబుతున్నారు. చాట్రాయి మండలంలో చిరుజల్లులతో రైతులు ఆందోళన చెందుతున్నారు. ధాన్యం పెద్ద మొత్తంలో కళ్లాలపై ఉంది. వర్షాలు పడితే ధాన్యం తడిచి తీవ్రంగా నష్టపోతామని అన్నదాతలు వాపోతున్నారు. చింతలపూడిలో వరి చేలను పరిశీలించిన ఏవో మీనాకుమారి వరి కోతలు వాయిదా వేయాలని రైతులకు సూచించారు.


చాట్రాయిలో కళ్లాలపై ధాన్యం రాశులు

కోసిన పంటను రక్షిత ప్రదేశాల్లో నిల్వ చేయాలి

జిల్లాలో వరి మాసూళ్లు ముమ్మరంగా సాగుతున్నాయి. ధాన్యం కొనుగోలు కేంద్రాలు జరుగుతోంది. ప్రస్తుతం బంగాళాఖాతంలో అల్పపీడనం, వర్షాల హెచ్చరిక నేపథ్యంలో రైతులు వరి పంటను సురక్షిత ప్రదేశాల్లో నిల్వ చేసుకోవాలి. ఆరబెట్టుకున్న ధాన్యాన్ని బస్తాలలో నింపి వాటిపై బరకాలు, టార్పాలిన్ కప్పాలి. వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున్న కొన్ని రోజులు వరి మాసూళ్లు వాయిదా వేసుకుంటే మంచిది. ఈ నెల 15 వరకు జిల్లాలో వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున వరి కోతలు నిలిపివేయాలి. కోసిన వరి పంటను కుప్పలుగా వేసి వాటిపై టార్పాలిన్‌లు కప్పాలి. కళ్లాల్లో ధాన్యాన్ని సురక్షిత ప్రాంతాల్లో నిల్వ చేసుకోవాలి.

షేక్ హబీబ్ బాషా,
జిల్లా వ్యవసాయ శాఖాధికారి



నీటి సంఘాల ఎన్నికలు వాయిదా?

త్వరలో అధికారిక ప్రకటన

(ఏలూరు-ఆంధ్రజ్యోతి ప్రతినిధి)

రాష్ట్ర వ్యాప్తంగా కొద్దిరోజుల్లో జరగాల్సి ఉన్న సాగునీటి సంఘాల ఎన్నికలు వాయిదా పడే అవకాశాలున్నాయి. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వం యోచిస్తోంది. ఇప్పుడున్న పరిణామాల క్రమంలో కొద్ది రోజుల పాటు సాగునీటి సంఘాల ఎన్నికలను వాయిదా వేయాలని అత్యధికులు అభిప్రాయపడుతున్న తరుణంలో దీనిపై నేడో రేపో కీలక నిర్ణయం తీసుకోనున్నారు. వాస్తవానికి ఇప్పటికే సాగునీటి సంఘాల ఎన్నికలకు సంబంధించి నోటిఫికేషన్ జారీ చేయడమే కాకుండా ఓటరు నమోదు ప్రక్రియను ఆదివారంతో పూర్తిచేశారు. జిల్లావ్యాప్తంగా ఉన్న 144 నీటి సంఘాలకు గాను ఎన్నికల ప్రక్రియ ఈనెల 23 నుంచి నెలాఖరు వరకు దశల వారీగా కొనసాగబోతుంది. సాగునీటి సంఘాల నుంచి ఎన్నికైన ప్రతినిధులు నేరుగా డిస్ట్రిబ్యూటరీ కమిటీలను ఎన్నుకోవాల్సి ఉంది. ఆ తర్వాత ప్రాజెక్టు కమిటీల ఎన్నిక పూర్తిచేయాల్సి ఉంది. ఈ ఎన్నికల ప్రక్రియను ఈనెల మొదటి నుంచే ఆరంభించి నెలాఖరులోపు పూర్తిచేయాలని ముందుగా అనుకున్నా ఇప్పటికే ఎన్నికలను కొద్దిరోజుల పాటు వాయిదా వేయాలనే నిర్ణయాన్ని ప్రభుత్వం పరిశీలనలోకి తీసుకుంది. ఒకవైపు అసెంబ్లీ సమావేశాలు జరుగుతున్న తరుణంలో తమ నియోజకవర్గాల్లో ఎన్నికల పర్యవేక్షణ కొంత ఆటంకంగానే ఉందని ఎమ్మెల్యేలు ప్రభుత్వానికి సూచించారు. దీంతో సాగునీటి సంఘాల ఎన్నికలను డిసెంబరు నాటికి పొడిగించాలనే యోచన చేస్తున్నట్టు తెలుస్తుంది. కొంతమంది ప్రజాప్రతినిధులు సైతం దీనిని ధ్రువపరుస్తున్నారు. వాస్తవానికి మంగళవారం నాడు ఈసంఘాల ఎన్నికల ప్రక్రియ వేగంగా శాంతియుతంగా కొనసాగించేందుకు కలెక్టర్ సైతం తహసీల్దార్లు, ఇరిగేషన్ అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి తగు సూచనలు చేయాలని నిర్ణయించారు. ప్రస్తుతం దీనిని రద్దు చేసుకున్నారు. సాగునీటి సంఘాల వారీగా ఓటరు నమోదు ప్రక్రియ ఇప్పటికే పూర్తికాగా వీటిపై అభ్యంతరాల స్వీకరణ మంగళవారంతో పూర్తి చేయాల్సి ఉంది. ఓటర్ల జాబితా ఆయా తహసీల్దార్ కార్యాలయాల్లో బహిరంగ ప్రదర్శనకు ఉంచారు. ఇలాంటి పరిస్థితుల్లో సాగునీటి సంఘాల ఎన్నికలు వాయిదా పడబోతున్నాయి.

నీటి పారుదల సలహా మండలి సమావేశం వాయిదా

ఏలూరు సిటీ, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): ఏలూరు జిల్లా నీటి పారుదల సలహా మండలి సమావేశం బుధవారం జరగాల్సి ఉంది. సమావేశం అనివార్య కారణాల వల్ల వాయిదా పడినట్లు ఇరిగేషన్ సర్కిల్ పర్యవేక్షక ఇంజనీర్ సీహెచ్ దేవప్రకాష్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. సమావేశం నిర్వహించే తేదీ ఖరారు చేసిన తర్వాత తెలియజేస్తామన్నారు.

గోదారి రోడ్లపై కొత్త ప్రయోగం



ఉమ్మడి గోదావరి జిల్లాల్లో తరచూ దెబ్బతింటున్న రోడ్లతో ప్రయాణం నిత్యం నరకంగా మారింది. అంతకంటే మించి ఊహించనలవి కాని ప్రమాదాలు, ప్రాణనష్టం కలవర పరుస్తోంది. వీటన్నింటికీ పరిష్కారానికి ప్రభుత్వం సరికొత్త ఆలోచన చేసింది. ఎక్కువకాలం మన్నేలా, ప్రయాణం సుఖవంతంగా జరిగేలా అనువైన రోడ్ల నిర్మాణానికి ప్రభుత్వం సరికొత్త ప్రతిపాదన చేయనుంది. జాతీయ రహదారులు, రాష్ట్ర రహదారుల్లో పాటిస్తున్నట్టుగానే ప్రభుత్వ, ప్రజల భాగస్వామ్యంతో కొత్తరోడ్ల నిర్మాణానికి ఇకముందు చర్యలు తీసుకోవాలన్న ఆలోచనలో కూటమి సర్కార్ ఉంది. తాజాగా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సైతం ఎమ్మెల్యేల భేటీలో ఈ విషయాన్ని ప్రస్తావించడం అందరినీ ఆకర్షిస్తోంది.

- రోడ్ల నిర్మాణానికి వినూత్న ప్రతిపాదనలు
- జిల్లాలో దెబ్బతిన్న రహదారులెన్నో
- ఎమ్మెల్యేలతో ముఖ్యమంత్రి సమాలోచన
- శాశ్వత పరిష్కారానికి చర్యలు

(ఏలూరు-ఆంధ్రజ్యోతి ప్రతినిధి)

గోదావరి జిల్లాల్లో గుంతలు పడిన.. కుంగిపోయిన.. ప్రయాణానికి అనువుగా లేని ఛిద్రమైన రహదారులు ఇక కనిపించకూడదని కూటమి ప్రభుత్వ లక్ష్యం. కొత్త విధానంలో రహదారుల నిర్మాణానికి కూటమి ప్రభుత్వం సరికొత్త ఆలోచనలు చేస్తుంది. తరచు రహదారులు దెబ్బతినడంతో మరమ్మతులు, నిర్మాణానికి ప్రభుత్వం కోట్లు వెచ్చించాల్సి వస్తుంది. వైసీపీ ప్రభుత్వ హయాంలో ఏలూరు జిల్లాలో ఆర్‌అండ్‌బి పరిధిలోని 1900 కిలో మీటర్ల నిడివి గల మార్గంలో సగానికి సగం 950 కిలో మీటర్ల మేర రహదారులు దెబ్బతిన్నాయి. ఆ మార్గంలో ప్రయాణించడం నరకప్రాయంగానే మారింది. దాదాపు ఐదేళ్లపాటు ఏలూరు-భీమవరం మార్గంలో 56 కిలో మీటర్ల మేర ప్రయాణించాలంటే సరాసరి రెండున్నర నుంచి మూడు గంటల సమయం పట్టేది. ఉమ్మడి పశ్చిమలో ఇలా దెబ్బతిన్న మార్గం ఇంకొకటి లేనేలేదు. అన్నిటికంటే మించి కొల్లేరు మీదుగా సాగే మార్గంలో తరచూ రోడ్లు మరమ్మతులు చేయడానికి పెద్ద ఎత్తునే ప్రభుత్వాలు ఖర్చుపెట్టాయి. అయినప్పటికీ తరచూ గొప్పులు గోతులతో వాహనాల రాకపోకలకు ఆటంకమే. జిల్లాలోని మరికొన్ని మార్గాల్లో కూడా భూమి అనుకూలంగా లేకపోవడంతో కోట్లాది రూపాయలతో ఏర్పాటు చేసిన తారు రోడ్లు గోతులు పడడం సర్వసాధారణం. ఈ తరహా సమస్యలకు శాశ్వత పరిష్కార మార్గాలను కూటమి ప్రభుత్వం శోధిస్తోంది. కూటమి ప్రభుత్వం అధికార పగ్గాలు చేపట్టిన 150 రోజుల్లో రోడ్ల మరమ్మతుకు, రోడ్లకు గుంతలు పూడ్చేందుకే ఏలూరు జిల్లాలోనే రూ.70 కోట్లు వెచ్చిస్తుంది. గడిచిన ఐదేళ్ళుగా పూర్తిగా దెబ్బతిన్న రోడ్లకు రూ.120 కోట్లకు పైగానే ఖర్చు చేస్తుంది. ఏడు నియోజకవర్గాలున్న కొత్త జిల్లాల పరిధిలోనే ఈ తరహా పరిస్థితులు ఉండడం, దీనికితోడు ప్రకృతి వైపరీత్యాలు, భారీ వర్షాలకు రోడ్లు ఛిద్రం కావడంతో ప్రత్యామ్నాయాలను కూటమి ప్రభుత్వం పరిశీలిస్తోంది. ఏటా కోట్లాది రూపాయలు రోడ్లపై ఖర్చు చేయడం, తిరిగి కొద్ది నెలల వ్యవధిలోనే మరమ్మతులకు గురికావడం, కాంటాక్టు ఏజెన్సీతో కుదుర్చుకున్న ఒప్పందానికి అనువుగా కొద్దిరోజులు మరమ్మతులు జరిగినా ఆ తదుపరి నిలిచిపోవడం వంటి పరిణామాలను ప్రభుత్వం పరిశీలనలోకి తీసుకున్నట్టయింది. ఇకముందు ఇలాంటి పరిస్థితులు తలెత్తకుండా దీర్ఘకాలంగా మన్నే రహదారుల నిర్మాణం వైపు ప్రభుత్వం దృష్టిపెట్టింది. ఇది సఫలీకృతమైతే ఇదేవిధానాన్ని పొరుగు జిల్లాలకు కూడా అన్వయించవచ్చని ప్రభుత్వం భావిస్తోంది.

ఇకముందు పీపీపీ యోచన?

ప్రజలకు సౌకర్యవంతమైన రహదారులను అందుబాటులోకి తెచ్చేందుకు ప్రభుత్వ ప్రైవేటు భాగస్వామ్యం (పీపీపీ) విధానం అమలు చేయాలని ప్రభుత్వం యోచిస్తున్నట్టు కనిపిస్తుంది. ఎన్‌డీఏ కూటమి, ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ సమావేశంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు దీనిపై సమాలోచన చేశారు. గోదావరి జిల్లాల్లో నల్లమట్టి నేలల్లో పట్టులేకపోవడం, తరచూ కుంగడం వంటి పరిణామాలతో రోడ్లపై ఖర్చంతా వృధా అవుతుందని, పీపీపీ భాగస్వామ్యంతో నిర్మించే రోడ్లు పక్కాగా ఉండేలా చూడాలని భావిస్తున్నట్టు సీఎం చంద్రబాబు నాయుడు చర్చించారు. ఈ విధానం గోదావరి జిల్లాల్లో విజయవంతమైతే పొరుగున కృష్ణా, గుంటూరు జిల్లాల్లో కూడా ప్రయోగించవచ్చని సీఎం ఆలోచన. ముఖ్యమంత్రి మదిలో ఆలోచనను కొద్దిరోజుల వ్యవధిలోనే ఆచరణలోకి తీసుకువచ్చే అవకాశం లేకపోలేదు. ఇప్పటికే ఏలూరు జిల్లాలో ఆర్‌అండ్‌బీతో పాటు పంచాయతీ రోడ్లు పూర్తిగా దెబ్బతిన్నాయి. వీటిలో ముఖ్యమైన ఒకటి లేదా రెండు, మూడు మార్గాలను పీపీపీ కింద ఎంపికచేసే అవకాశం ఉందని అధికార వర్గాలు చెబుతున్నాయి. ఈ పరిస్థితి ఈ రెండు శాఖలు తొలుత అంచనా వేస్తాయి. ఉదాహరణకు ఏలూరు-జంగారెడ్డిగూడెం మార్గం అత్యంత క్లిష్టతరమైనది కాగా, ఏలూరు-భీమవరం మార్గంలో ఇలాంటి పరిస్థితులే ఉన్నాయి. వీటిని ప్రయోగాత్మకంగా కొత్త విధానంలోకి చేర్చవచ్చనే అంచనాలు కనిపిస్తున్నాయి.


కోకో మొక్కను పరిశీలిస్తున్న కలెక్టర్ వెట్రిసెల్వీ

హార్టీకల్చర్ హబ్‌గా ఏలూరు జిల్లా : కలెక్టర్

పెదవేగి, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): ఉద్యానవన పంటల విస్తీర్ణాన్ని మరింత పెంచి ఏలూరు జిల్లాను హార్టీకల్చర్ హబ్‌గా తీర్చిదిద్దుతామని కలెక్టర్ కె.వెట్రిసెల్వీ అన్నారు. ఈ మేరకు అధికారులు రైతుల్లో చైతన్యం తీసుకురావాలన్నారు. మండలంలో ఉద్యానవన పంటలను కలెక్టర్ మంగళవారం పరిశీలించి రైతులతో మాట్లాడారు. దిబ్బగూడెంలో ఆయిల్‌పామ్, కొబ్బరి, కోకో, మిరియం, పసుపు, ఆవకాడో పంటలు, గార్లమడుగులో అరటితోటలో బిందుసేద్యం, పెదవేగిలో ఏపీ ఆయిల్‌ఫెడ్ ప్రాసెసింగ్ యూనిట్, ఆయిల్ పామ్‌లో అంతర పంట కోకో, లక్ష్మీపురంలో కొబ్బరి తోటలో దాల్చినచెక్క, యాలకులు, వక్క, జాజికాయ, లిచీ పంటలను పరిశీలించారు. కలెక్టర్ వెంట ఉద్యానశాఖ డీడీ ఆర్.రామ్మోహన్, మైక్రో ఇరిగేషన్ పీడీ పి.రవికుమార్, తహసీల్దారు ఎస్‌డీ.భ్రమరాంబ, ఉద్యానశాఖాధికారి కె.రత్నమాల పాల్గొన్నారు.

పరిశోధనా ఫలితాలు రైతులకు అందుబాటులోకి రావాలి

ప్రయోగశాలల్లోని పరిశోధనా ఫలితాలు క్షేత్రస్థాయిలో రైతులకు అందుబాటులోకి రావాలని, అప్పుడే ఆశించిన ఫలితాలు వస్తాయని కలెక్టర్ కె.వెట్రిసెల్వీ అన్నారు. పెదవేగిలోని జాతీయ ఆయిల్‌పామ్ పరిశోధనా సంచలనాలయమ్ (ఐకార్) కేంద్రం శాస్త్రవేత్తలతో కలెక్టర్ మాట్లాడారు. ఆధునిక వ్యవసాయ పద్ధతులపై రైతులకు అవగాహన కల్పించాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందని, ఆ దిశగా కృషి చేయాలని చెప్పారు. ఐకార్ సెంటర్ డైరెక్టర్ డాక్టర్ కంచర్ల సురేష్, శాస్త్రవేత్తలు ఎంవీ.ప్రసాద్, కె.మనోరమ, కె.రామ చంద్రుడు, రవిచంద్రన్, సుధాకర్ పాల్గొన్నారు.

రహదారుల నిర్మాణంలో నాణ్యతా ప్రమాణాలు పాటించాలి

రహదారుల నిర్మాణంలో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని, లేకుంటే కాంట్రాక్టర్లను బ్లాక్‌లిస్ట్‌లో పెడతామని కలెక్టర్ వెట్రిసెల్వీ హెచ్చరించారు. రాయన్నపాలెంలో సీసీరోడ్డు నిర్మాణ మెటీరియల్, రహదారి వెడల్పు అంశాలను పరిశీలించారు. రహదారి నాణ్యతపై అధికారులు బాధ్యతతో పర్యవేక్షణ చేయాలన్నారు. కలెక్టర్ వెంట పీఆర్ ఇన్‌చార్జ్ ఎస్‌ఈ రమణమూర్తి, డీఈ శ్రీనివాసరావు, ఏఈ మురళి, ఎంపీడీవో శ్రీనివాస్ ఉన్నారు.

జైలులో ఖైదీలకు ఉపాధి : ఎస్పీ


- జిల్లా జైలులో రక్షణ చర్యలు పరిశీలన

ఏలూరు క్రైం, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి) : జైలులో ఖైదీలకు పోలీస్ శాఖ నిర్వహిస్తున్న పెట్రోల్ బంకుల్లో ఉపాధి కల్పిస్తామని ఎస్పీ కేపీఎస్ కిశోర్ హామీ ఇచ్చారు. జిల్లా జైలులో భద్రతా చర్యలను ఎస్పీ కిశోర్ మంగళవారం పరిశీలించారు. భద్రతపై సమీక్షించారు. జైలులో రిమాండ్ ఖైదీలకు కల్పిస్తున్న సౌకర్యాలను పరిశీలించారు. రిమాండ్ ఖైదీలను ఉద్దేశించి ఎస్పీ మాట్లాడుతూ ఖైదీలు సత్‌ప్రవర్తనతో మెలగాలని, నేరాలు చేసి జైలులో ఉంటే దాని ప్రభావం కుటుంబంపై పడుతుందన్నారు. పిల్లలను మంచి పద్ధతిలో పెంచి చదువు నేర్పించాలన్నారు. అనంతరం అధికారులతో మాట్లాడుతూ సీసీటీవీ ఫుటేజ్ ఎప్పటికప్పుడు పరిశీలించాలన్నారు. జిల్లా జైలులో సెంట్రీ టవర్‌ను నిర్మించాలని ఎస్పీ సూచించారు. జైలు గోడ చుట్టూ ఎలక్ట్రికల్ లైవ్ లైన్లు ఏర్పాటు చేసే ప్రతిపాదన ఉన్నతాధికారులకు పంపించాలని ఆదేశించారు. జైలు సూపరింటెండెంట్ సీహెచ్ ఆర్‌వి.స్వామి, ఏఆర్ డీఎస్పీ శ్రీహరి, జైలర్లు కె వెంకటరెడ్డి, కె.శ్రీనివాసరావు, డిప్యూటీ జైలర్ కిశోర్‌కుమార్, కె.సత్యనారాయణ, డాక్టర్ జి స్వరూప్, జైలు సిబ్బంది పాల్గొన్నారు.


జైలు అధికారులతో మాట్లాడుతున్న ఎస్పీ

అపార్ నమోదులో జిల్లా ప్రథమం

ఏలూరు అర్బన్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): విద్యార్థుల సమగ్ర డేటా 'అపార్' నమోదులో రాష్ట్రంలోనే ఏలూరు జిల్లా ప్రథమ స్థానంలో నిలిచిందని డీఈవో వెంకటలక్ష్మమ్మ తెలిపారు. జిల్లాలోని డీవైఈవోలు, ఎంఈవోలు, సమగ్రశిక్ష సెక్టోరల్, ఇంజనీరింగ్ అధికారులతో మంగళవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. మంగళవారం 'అపార్' డేటా నమోదు 79.8 శాతం పూర్తయిందని, క్షేత్రస్థాయిలో ఎంఈవోలు, హెచ్‌ఎంల కృషివల్లే ఇది సాధ్యమైందన్నారు. మిగిలిన 20 శాతం కూడా త్వరితగతిన పూర్తిచేయాలని సూచించారు. ముఖ్యంగా అపార్ నమోదుకు ఆటంకంగావున్న విద్యార్థుల పుట్టిన తేదీ సవరణ, ఆధార్ సవరణలో సమస్యల పరిష్కారానికి తీసుకున్న చర్యలు వివరించారు. పలువురు ఎంఈవోలు మాట్లాడుతూ పాలనాపరమైన విషయాల్లో ఎంఈవోల అభిప్రాయాలకు ప్రాధాన్యం ఇవ్వాలని, డీఈవో కార్యాలయ అధికారులు, తమకు మధ్య సమన్వయం ఉండేలా చర్యలు తీసుకోవాలని అభ్యర్థించారు. అకారణ మెమోలు, ఉపాధ్యాయ సంఘాల ఆరోపణలపై తొందరపడి విచారణ చేపట్టడం చేయొద్దని కోరారు. ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాల విద్యార్థుల అభ్యసనా సామర్థ్యాలపై డిసెంబరులో జాతీయస్థాయిలో చేపట్టనున్న 'నాస్' పరీక్ష నిర్వహణపై డీసీఈబీ కార్యదర్శి సర్వేశ్వరరావు వివరించారు.



శాసనసభ డిప్యూటీ స్పీకర్‌గా రఘురామకృష్ణరాజు

విప్‌లుగా నరసాపురం, తాడేపల్లిగూడెం ఎమ్మెల్యేలు నాయకర్, బొలిశెట్టి శ్రీనివాస్

కూటమి ప్రభుత్వ కీలక నిర్ణయం

7

బంగారం.. మతలబు!

- వ్యాపారుల వద్దకు దోచిన, నకిలీ బంగారం
- తాకట్టు పెడుతున్న దొంగలు
- పోలీసు కేసుల్లో ఇరుక్కుంటున్న వ్యాపారులు








ఆకాశంలో ఆర్ట్ గ్యాలరీ !

ఆకాశం రంగులద్దుకుంది.. సూర్యుడు మబ్బుల చాటు నుంచి ఇదిగో ఇలా అందమైన దృశ్యాలను ఆవిష్కరించాడు.. ఆకాశంలో పెయింటింగ్ పోటీలు పెట్టినట్టుగా రకరకాలు రంగులు కనువిందు చేశాయి..మంగళవారం సాయంత్రం ద్వారకాతిరుమలలో కనిపించిన ఈ దృశ్యాలు చూపరులను కట్టిపడేశాయి. అప్పటి వరకు నీలవర్ణంలో శోభిల్లిన ఆకాశం రంగులు మారుతూ అరుణ కాంతులను ప్రజ్వలింప చేశాయి. ఆహా...ఏమి ఈ సోయగం అంటూ చూపరులు కొంతసేపు ముగ్ధులయ్యారు.

- ద్వారకాతిరుమల



నేడు క్షీరాబ్ది ద్వాదశి

నేటితో చతుర్మాస వ్రత సమాప్తి



ఏలూరు కార్పొరేషన్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి) : నేడు క్షీరాబ్ది ద్వాదశి. దేవ దానవులు ఈ రోజునే క్షీరసాగర మథనం చేశారని అందుకే చిలుకు ద్వాదశి అంటారని చెబుతారు. కార్తీక శుద్ధ ఏదాదశి రోజున క్షీర సముద్రంపై శయనించిన విష్ణుమూర్తి నిద్ర లేచి బ్రహ్మాది దేవతలతో కలిసి తులసి వనంలోకి (బృందావనం) ప్రవేశిస్తారట.. అందుకే ఈ రోజున ఎవరైతే తులసి మొక్కకు పూజ చేస్తారో వారికి సకల శుభాలు కలుగుతాయని పురాణాలు ద్వారా తెలుస్తోంది. కార్తీకమాసంలో క్షీరాబ్ది ద్వాదశి రోజున చేసే పూజలు, వ్రతాలు, దీపారాధనలు ఎంతో పుణ్యప్రదమని ఏలూరు రామచంద్రరావుపేట వేంకటేశ్వరస్వామి ఆలయ ప్రధాన అర్చకులు కిళాంబి మారుతీ శ్రీనివాస రామానుజాచార్యులు చెప్పారు. క్షీరాబ్ది ద్వాదశి రోజున కొత్తగా తులసి మొక్కను నాటి విష్ణువును పూజించాలన్నారు. తులసి కోటలో ఉసరి కొమ్మను ఉంచి పసుపు, కుంకుమలతో ఓం తులసీ ధాత్రి సహిత లక్ష్మీ నారాయణస్వామిని పూజించాలి. శ్రీ మహావిష్ణవే దామోదరాయ శ్రీదేవ్యైతులసై నమః అని స్తోత్రించాలి. ఈ రోజున దీపం వెలిగించిన వారికి ఏడాది పొడవునా దీపం వెలిగించిన ఫలితం దుక్కుతుంది. ఈ రోజున విష్ణువును ప్రార్థించి పూజించడం ద్వారా చతుర్మాస్య వ్రత సమాప్తం అవుతుందని తెలిపారు.





శ్రీవారి జల విహారానికి ఏర్పాట్లు పూర్తి


ద్వారకాతిరుమల, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి):ప్రముఖ పుణ్యక్షేత్రం ద్వారకాతిరుమలలో శ్రీవారి తెప్పోత్సవం వైభవంగా నిర్వహిం చేందుకు దేవస్థానం అన్ని ఏర్పాట్లు చేసింది. క్షీరాబ్ది ద్వాదశి పర్వదినమైన బుధవారం రాత్రి స్వామివారు ఉభయదేవేరులతో కలసి సుదర్శన పుష్కరిణిలో విహరిస్తారు. దేవస్థానం ఇప్పటికే పుష్కరిణిని సర్వాంగసుందరంగా తీర్చిదిద్దింది. సాగర పరిసరాలను విద్యుత్ దీపకాంతులతో అలంకరించారు. స్వామి, అమ్మవార్లు విహరించే తెప్పను హంసవాహనంగా అలంకరిస్తున్నారు. పుష్కరిణి ముందు భారీ విద్యుత్ కటౌట్‌లను ఏర్పాటు చేశారు. బుధవారం రాత్రి శ్రీవారు, ఉభదేవేరులతో కలసి ప్రత్యేక వాహనంలో తిరువీధుల్లో తిరిగి పుష్కరిణి వద్దకు చేరుకుంటారు. అనంతరం పుష్కరిణిలో విహరిస్తారు.





కల్యాణం తిలకిస్తున్న భక్తులు.. కల్యాణ శోభలో స్వామివారు

ఘనంగా శ్రీనివాస కల్యాణం



పెంటపాడు, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి) : పెంటపాడు వెలమ యువజన సంఘం ఆధ్వర్యంలో జరుగుతున్న గౌరీదేవి మహోత్సవాలలో భాగంగా అమ్మవారి ఆలయం వద్ద మంగళవారం శ్రీనివాస కల్యాణం ఘనంగా నిర్వహించారు. కల్యాణ వేడుకను తిలకించేందుకు అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. కళ్యాణం అనంతరం భక్తులకు తీర్థ ప్రసాద వితరణ గావించారు. ఈ నె ల 15వ తేదీ శుక్రవారం ఆలయం వద్ద విజయవాడ దుర్గా మల్లేశ్వరస్వామి కల్యాణం నిర్వహించనున్నట్లు కమిటీ సభ్యులు తెలిపారు.



వీరభద్రస్వామికి ఘనంగా జలాభిషేకం

ఆకివీడు, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి) : ఆకివీడు కాశీ విశ్వేశ్వర అన్నపూర్ణ సహిత భద్రకాళీ సమేత వీరభద్రస్వామి 14వ వార్షికోత్సవ కల్యాణం స్థానిక సాలిపేటలో మంగళవారం ఘనంగా జరిగింది. మహిళలు కాలువలో స్నానమాచరించి 108 బిందెలతో తీసుకు వచ్చిన గంగాజలం, పంచామృతాలతో అభిషేకం చేశారు. కార్తీక ద్వాదశి కావడంతో సాయంత్రం మహిళలు సామూహిక కుంకుమ పూజలు నిర్వహించారు. కళ్యాణానికి పీటలపై కూర్చున్న సిద్ధాని శ్రీనివాస్-మహేశ్వరీ దంపతులు బంగారు సూత్రాలు అందజేశారు. అర్చకులు స్వామి కళ్యాణం చేయించారు. రాత్రి స్వామి ప్రభ ఊరేగింపు, శూలాల సంబరం జరిపారు.

గణపవరం డిగ్రీ కళాశాలలో మహిళల టెన్నిస్ టోర్నమెంట్

గణపవరం, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): గణపవరం చింతలపాటి మూర్తి రాజు ప్రభుత్వ డిగ్రీ కాలేజీలో ఆదికవి నన్నయ్య విశ్వ విద్యాలయం ఆధ్వర్యంలో మహిళల టేబుల్ టెన్నిస్ టోర్నమెంట్ మంగళవారం ప్రారంభించారు. విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో కూడా రాణించాలని ఎన్సిపాల్ డాక్టర్ నిర్మల కుమారి సూచించారు. తొలిరోజు జరిగిన పోటీల్లో ప్రథమ స్థానంలో పెనుకొండ ఎస్‌పీకేవీ కళాశాల విద్యార్థులు నిలవగా రెండో స్థానంలో తణుకు ఎస్‌కేఎస్‌డీ మహిళా కళాశాల, 3వ స్థానం ఏలూరు సెయింట్‌థెరిస్సా, నాల్గో స్థానంలో



గణపవరం మూర్తిరాజు ప్రభుత్వ డిగ్రీ కళాశాల క్రీడాకారులు విజయం సాధించారు. పీడీలు ఫణీంద్ర, పవన్‌కుమార్, వైస్ ప్రిన్సిపాల్ మధు రాజు, అధ్యాపకులు, పాల్గొన్నారు.

రిజిస్ట్రేషన్లకు రీసర్వే చిక్కులు

ఎల్‌పీ నంబర్లు కేటాయించిన గ్రామాల్లో నిలిచిన రిజిస్ట్రేషన్లు

దిక్కుతోచని కక్షిదారులు



ఆచంట, నవంబరు, 12 (ఆంధ్రజ్యోతి): భూములు, స్థలాలు అమ్మకాలు, కొనుగోలు విషయంలో కక్షిదారులకు ఇంకా ఇబ్బందులు తప్పలేదు. ఇటీవల రిజిస్ట్రేషన్‌ల లావాదేవీలుబాగా తగ్గిపోయాయి. గత ప్రభుత్వం వ్యవసాయ భూములకు సంబంధించి భూముల రీసర్వే విధానం ప్రవేశ పెట్టింది. అయితే సర్వే చేసిన అనంతరం అధికారులు ఆయా సర్వే నంబర్‌లకు సంబంధించి ఎల్‌పీ నంబర్లు కేటాయించారు. ఆ సర్వే నంబర్లకు సంబంధించి మొదట్లో రిజిస్ట్రేషన్‌లు నిలిచిపోయాయి. ఆచంట సబ్ రిజిస్ట్రార్ పరిధిలో ఆచంట, పెనుగొండ, పోడూరు మూడు మండలాలకు సంబంధించి 20 గ్రామాలు ఉన్నాయి. అయితే ఆచంట మండలంలోని కొడమంచిలి, కరుగోరుమిల్లి, పెనుమంచిలి, గ్రామాలు పోడూరు మండలంలో రావిపాడు, మినిమించిలిపాడు గ్రామాలు, పెనుగొండ మండలంలో నడిపూడి గ్రామాలకు సంబంధించి రీసర్వే నంబర్లకు సంబంధించి ఎల్‌పీ నంబరు కేటాయించడంతో ఈ గ్రామాలకు సంబంధించి రిజిస్ట్రేషన్‌లు మొదట్లో రిజిస్ట్రేషన్‌లు జరిగేవి కావు. అయితే ఎల్‌పీ నంబర్లుకు సంబంధించి ఇటీవల కాలంలో రిజిస్ట్రేషన్‌లు జరిగాయి. సుమారు 2 నెలలపాటు రిజిస్ట్రేషన్‌లు బాగానే జరిగాయి. పది రోజులుగా ఎల్‌పీ నెంబర్లు కేటాయించిన గ్రామాలకు సంబంధించి రిజిస్ట్రేషన్లు నిలిచిపోయాయి. దీంతో ఈ గ్రామాలకు సంబంధించి భూములు అమ్మాలన్నా, ఇంటిలో వారికి సెటిల్‌మెంటు దస్తావేజు రాయాలన్నా, పెళ్ళి దస్తావేజులు రాయాలన్నా రిజిస్ట్రేషన్‌లు జరగడం లేదు. దీని కారణంగా ప్రభుత్వానికి వచ్చే రెవెన్యూ కూడా ఘననీయంగా తగ్గిపోయింది. ఇటీవల పెట్టిన రెవెన్యూ సదస్సుల్లో సైతం రీసర్వే విధానం రద్దు చేయాలని అనేక మంది రైతులు అధికారులకు ఫిర్యాదులు కూడా చేశారు. రీసర్వే విధానం వల్ల తమ భూములకు సంబంధించి సరైన రికార్డులు లేకుండా పోయాయని కనీసం ఇపుడు రిజిస్ట్రేషన్ చేసుకుందామన్నా రిజిస్ట్రేషన్‌కు అనుకూలంగా లేకుండా పోయిందని పలువురు కక్షిదారులు వాపోతున్నారు. ఇటీవల ఈ గ్రామాలకు సంబంధించి రిజిస్ట్రేషన్‌లు సజావుగా జరిగినప్పటికీ మరలా రిజిస్ట్రేషన్‌లు నిలిచిపోవడంపై రైతులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. అధికారులు స్పందించి రీసర్వే అయిన గ్రామాలకు సంబంధించి భూములు రిజిస్ట్రేషన్‌లు సజావుగా అయ్యేట్లు చూడాలని కోరుతున్నారు.

మూడు నెలలుగా నిలిచిపోయాయి

ఆచంట మండలంలోని పెదమల్లం గ్రామానికి సంబంధించిన భూములకు రీసర్వే అవ్వలేదు. అయినప్పటికీ మూడు నెలలుగా ఈ గ్రామానికి సంబంధించి రిజిస్ట్రేషన్‌లు నిలిచిపోయాయి. సర్వే నెంబరుకు సంబంధించి డేటా వివరాలు డిస్‌ప్లే అవని కారణంగా రిజిస్ట్రేషన్‌లు నిలిచిపోయాయి. దీనిపై సంబంధిత అధికారులను అడిగినప్పటికి టెక్నికల్ ప్రోబ్లమ్ వల్లే సమస్య వచ్చిందని త్వరలోనే సమస్య తీరుతుందని చెబుతున్నారు.



పాస్టర్ల ఆందోళన

నరసాపురం టౌన్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): పాస్టర్లు, మందిరాలకు భద్రత కల్పించాలంటూ మంగళవారం క్రైస్తవుల సంఘం ఆధ్వర్యంలో సబ్‌కలెక్టర్ కార్యాలయం వద్ద ఆందోళన చేపట్టారు. పట్టణంతో పాటు యలమంచిలి, మొగల్తూరు ప్రాంతాలకు చెందిన పాస్టర్లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పాస్టర్లు రుబేన్, గుమ్మాపు శ్యామ్, ఈదా జాషువ మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా పాస్టర్ల డేటాను సచివాలయ సిబ్బంది చేత ప్రభుత్వం సేకరించడం దారుణమన్నారు. ఈ విధానం వల్ల సేవ చేసే వార్ని భయభ్రాంతులకు గురిచేస్తుందన్నారు. డేటా సేకరణ నిలుపుదల చేయనిపక్షంలో రాష్ట్ర వ్యాప్తంగా ఉద్యమిస్తామని హెచ్చరించారు.

స్కూల్‌గేమ్స్‌లో సూర్యహంసినికి నాలుగు బంగారు పతకాలు



భీమవరం టౌన్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి) : భారతీయ విద్యాభవన్స్‌లో 11వ తరగతి చదువుతున్న మాదాల సూర్యహంసినీ గుజరాత్‌లో జరిగిన 68వ నేషనల్ స్కూల్స్ గేమ్స్‌లో నాలుగు బంగారు పతకాలను సాధించింది. ఈనెల 10 నుంచి 12 వరకు స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో జరిగిన పోటీల్లో ఉమన్ నేషనల్ ర్యాంకింగ్ విలువిద్య అండర్-17సబ్ జూనియర్స్ కేటగిరీలో వ్యక్తిగత కేటగిరీలో 1వ రౌండ్‌లో బంగారుపతకం, రెండో రౌండ్‌లో బంగారు పతకం, ఓవరాల్‌గా భారీ స్కోర్ చేసి బంగారు పతకాన్ని గెలుచుకుంది. ఈ నాలుగు బంగారు పతకాలు కారణంగా పతకాల పట్టికలో ఆంధ్రప్రదేశ్ 31వస్థానం నుంచి 5వ స్థానానికి చేరుకోవటం విశేషం. సూర్యహంసినిని జిల్లా ఆర్చరీ అసోసియేషన్ సెక్రటరీ జయరాజు, కోచ్ కమల్ కిషోర్, సాయిహిత్‌లు అభినందించారు.



విజయం సాధించిన మెడికల్ సెకండియర్ విద్యార్థులు

ఆశ్రం మెడికల్ కళాశాలలో ఉత్సాహంగా ఫుట్‌బాల్ పోటీలు

ఏలూరు రూరల్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): ఆశ్రం మెడికల్ కళాశాలలో ఆ కళాశాల మెడికల్ విద్యార్థుల మధ్య జరిగిన క్రీడాపోటీలు ఉత్సాహంగా జరిగాయి. వారం రోజులుగా ఇంటర్, మోరల్ ఫుట్‌బాల్ క్రీడాపోటీలను నిర్వహించారు. మంగళవారం ఫైనల్ పోటీ జరిగింది. పోటీల్లో మెడికల్ సెకండియర్ విద్యార్థులు కప్పు కైవశం చేసుకున్నారు. మెడికల్ పీజీ విద్యార్థులు ద్వితీయ స్థానంలో నిలిచారు. సీఈవో హనుమంతరావు, జిల్లా ఫుట్‌బాల్ అసోసియేషన్ కార్యదర్శి పవన్‌కుమార్ బహుమతులు అందజేశారు. గెలుపొందిన క్రీడాకారులను ఆశ్రమ యాజమాన్యం అభినందించి బహుమతులు, ప్రశంసాపత్రాలను అందజేశారు.

జాతీయ స్థాయి స్కూల్ గేమ్స్‌కు తూర్పుతాళ్ళు విద్యార్థిని



నరసాపురం రూరల్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తూర్పు తాళ్ళు హైస్కూల్‌లో 8వ తరగతి చదువుతున్న మేడిద డింపుల్ శ్రీజ విద్యార్థి జాతీయస్థాయి పోటీకి ఎంపికైంది. ఇటీవల కడప జిల్లా కమలాపురంలో జరిగిన 68వ రాష్ట్రస్థాయి స్కూల్ గేమ్స్ అండర్-14 బాలబాలికల పోటీలకు తూర్పు తాళ్ళు స్కూల్ నుంచి ఆరుగురు విద్యార్థినులు పాల్గొన్నారు. వీరిలో శ్రీజ ఎంపికై త్వరలో బీహార్‌లో జరిగే పోటీలకు ఆంధ్రప్రదేశ్ జట్టు తరఫున పాల్గొంటుందని స్కూల్ ప్రిన్సిపాల్ అనిల్ కుమార్ తెలిపారు. స్కూల్ ఛైర్మన్ చామకూరి రాజు, పీడీ రామకృష్ణ, ఉపాధ్యాయులు విద్యార్థిని అభినందించారు.

నేటి నుంచి సీనియర్ సిటిజన్స్ జాతీయస్థాయి టెన్నిస్ పోటీలు



సీనియర్ సిటిజన్స్ జాతీయ స్థాయి టెన్నిస్ పోటీలకు సిద్ధమైన కోర్టు

పాలకొల్లు అర్బన్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): పాలకొల్లు కాస్మో కల్చరల్ క్లబ్ ఆధ్వర్యంలో బుధవారం నుంచి 17వ తేదీ వరకూ క్లబ్ ఫౌండర్, టెన్నిస్ ప్లేయర్ సిహెచ్ బుద్ధావతారం రాజు మెమోరియల్ పేరుతో జాతీయ స్థాయిలో టెన్నిస్ పోటీలకు అన్ని ఏర్పాట్లను చేశారు. కాస్మో కల్చరల్ క్లబ్ ఛైర్మన్ గొట్టుముక్కల గాంధీ భగవాన్ రాజు పర్యవేక్షణలో 45, 55, 65, 70, 75 వయసుల వారీగా సింగిల్, డబుల్స్ పోటీలు నిర్వహించనున్నారు. పోటీలు పట్టణంలోని కాస్మో క్లబ్ ఆవరణలోని కోర్టులోనూ, టౌన్‌హాల్ కోర్టులోనూ, నరసాపురం ఆఫీసర్స్ క్లబ్ కోర్టులోనూ జరుగుతాయి. పోటీల అనంతరం ఈనెల 17న ఫైనల్ మ్యాచ్, అనంతరం బహుమతి ప్రదానం జరుగుతుంది. డైరెక్టర్ సోమరాజు, ఆర్గనైజింగ్ కార్యదర్శి రాజు, రుద్రరాజు సత్యనారాయణ రాజు, శ్రీనివాస రాజు పర్యవేక్షిస్తున్నారు.

స్విమ్మింగ్ పోటీల విజేతలకు ఎస్పీ అభినందన



సిబ్బందిని అభినందిస్తున్న ఎస్పీ నయీం అస్మీ

భీమవరం క్రైం, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి) : స్విమ్మింగ్ కాంపిటీషన్లో గోల్డ్ మెడల్ గెలిచిన పోలీస్ సిబ్బందిని జిల్లా ఎస్పీ అద్నాన్ నయీం అస్మి మంగళవారం అభినందించారు. రాజమహేంద్రవరంలో ఆదివారం జరిగిన ఆంధ్రప్రదేశ్ మాస్టర్స్ స్విమ్మింగ్ అసోసియేషన్ నిర్వహించిన రాష్ట్ర స్థాయి స్విమ్మింగ్ పోటీలలో డీసీఆర్‌బీ హెడ్ కానిస్టేబుల్ వసుపులేటి సత్యనారాయణ 200 మీటర్ల ఫ్రీస్టైల్‌లో గోల్డ్ మెడల్, 100 మీటర్లు ఐఎమ్‌లో గోల్డ్ మెడల్, 100 మీటర్ల బ్రెస్ట్ స్ట్రోక్‌లో సిల్వర్‌మెడల్, 50 మీటర్ల బ్యాక్ స్ట్రోక్ విభాగంలో గోల్డ్ మెడల్, 25 మీటర్లు బ్యాక్ స్ట్రోక్ విభాగంలో గోల్డ్ మెడల్, 100 మీటర్లు బ్యాక్‌స్ట్రోక్ విభాగంలో సిల్వర్ మెడల్ గెలుచుకున్నారు. మెడల్స్‌ని సాధించిన పోలీస్ సిబ్బందిని జిల్లా ఎస్పీ అస్మి అభినందించారు. ఈ కార్యక్రమంలో జిల్లా పోలీస్ అసోసియేషన్ ప్రెసిడెంట్ సిహెచ్ మోజేష్, తదితరులు పాల్గొన్నారు.

పేదల ఆకలి తీర్చే దేవుళ్లు





ఆహార పదార్థాలను పేదలకు పెడుతున్న సంస్థ సభ్యులు

ఆయన ఒక దివ్యాంగుడు.. పోస్టల్ శాఖలో ఉద్యోగి. వైకల్యం కారణంగా ఆయన సరిగా నడవలేరు.. కానీ ఆలోచనలు మంచి సమాజానికి బాటలు వేశాయి.. సమాజం తనకు ఎంతో సహకారం ఇచ్చిందని అలాంటి సమాజానికి తాను కూడా ఏదో ఒకటి చేయాలనే ఆలోచన నుంచి పుట్టుకొచ్చిన సంస్థ లక్షన్నర పేదల కడుపు నింపింది. తాడేపల్లిగూడెంలో పోస్టల్ శాఖలో చిరుద్యోగిగా పనిచేస్తున్న తమ్మిరెడ్డి బాలబ్రహ్మం నో ఫుడ్ వేస్ట్ సంస్థను స్థాపించి పేదల కడుపు నింపుతున్నారు..

తాడేపల్లిగూడెం రూరల్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): పోస్టల్ శాఖలో పనిచేస్తూ అందరి మన్ననలు పొందిన బాలబ్రహ్మం తనకు 50 ఏళ్లు పూర్తయిన సమయంలో



పేదలకు భోజనం అందిస్తున్న బొలిశెట్టి(ఫైల్)

నో ఫుడ్ వేస్ట్ సంస్థ ద్వారా సేవలు

శుభకార్యాల్లో మిగిలిన పదార్థాలు వృథా కాకుండా అన్నార్థులకు పంపిణీ

సమాజం కోసం ఏం చేద్దాం అని ఆలోచించారు. ఒక పూట భోజనం దొరికితే చాలనుకునే పేదలు చాలామంది ఉన్నారు. ఆ సమయంలో వారికి ఇంత అన్నం పెడితే చాలు దేవుళ్లుగా భావిస్తారు. ఫంక్షన్లలో మిగిలిన ఆహారం వేస్ట్ చేయకుండా పేదలకు పంచే ఒక సంస్థ కార్యకలాపాలను చూసి అలా చేస్తే బావుంటుందని భావించి స్నేహితులతో చెప్పారు. వారు కూడా ఈ ఆలోచన బాగుందని చెప్పడంతో 2015లో "నో ఫుడ్ వేస్ట్ " అనే సేవా సంస్థ పురుడు పోసుకుంది. అప్పటి నుంచి ఆ సంస్థ ద్వారా స్నేహితుల సహకారంతో ఏ ఇంట వేడుక జరిగినా అక్కడ మిగిలిన ఆహారం వృథా కాకుండా ఆ ఆహారాన్ని పేదలకు, బాటసారులకు అందించడం ప్రారంభించారు. ఇలా తొమ్మిది సంవత్స రాలుగా సేవలందిస్తూ ఇప్పటివరకు లక్షన్నర మంది ఆకలి తీర్చారు.

కరోనాలో కూడా..

వీరు సాధారణ సమయంలో పేదలకు ఆహారం అందించడంతో పాటు కరోనా సమయంలో కూడా తమ వంతు సాయం అందించారు. రూ. 25 లక్షలు విలువ చేసే పేదలకు ఇమ్యూనిటీ అందించే విధంగా ఆహారంతో పాటు, టీపొడి, పాలపొడి, ఆహారం, ఫ్రూట్ జూస్, బోర్నవిటా వంటివి అందించారు.

బాసటగా బొలిశెట్టి

పెద్దోళ్ల ఇంట జరిగే వేడుకల్లో మిగిలే ఆహారం వృధా కాకుండా పేదలకు ఆహారం అందించే సంస్థ సేవలను అప్పటి మున్సిపల్ ఛైర్మన్, ప్రస్తుత ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ గుర్తించి బాసటగా నిలిచారు. ఆ సంస్థకు ఉపయోగపడే విధంగా ఓ వాహనాన్ని (మారుతి ఎకోను) ఆయన ఉచితంగా అందించారు.

స్నేహితులు తోడుగా నిలిచారు..



సమాజానికి ఏదోకటి చేద్దామని తలవగానే నా స్నేహితులు తోడుగా నిలిచారు. వారితో పాటు పట్టణంలో ప్రముఖులు కూడా సంస్థకు సహకరించారు. మరిన్ని సేవలు అందిచేలా ప్రణాళికలు వేసుకుంటున్నాం. ఇప్పటికే లక్ష మందికి పైగా ఆహారం అందించాం.

- తమ్మిరెడ్డి బాలబ్రహ్మం, నో ఫుడ్ వేస్ట్ సంస్థ వ్యవస్థాపకుడు

భవిష్యత్తులో మరిన్ని సేవా కార్యక్రమాలు



మా బాలబ్రహ్మం ఎంతో పెద్ద మనసుతో ఈ సంస్థ ఏర్పాటు చేద్దామని ఆలోచించారు. ఆయనకు మేం తోడుగా నిలిచాం. సంస్థ ద్వారా ఎంతో మందికి సాయం అందించాం ఆకలితో ఉన్నవారికి భోజనం అందించడం ఆనందాన్నిస్తుంది. పేదలకు సాయం చేసేం దుకు ఇదే స్ఫూర్తితో సంస్థ కార్యకలాపాలు విస్తృతం చేస్తాం.

- యెగ్గిన శరత్, సంస్థ ప్రతినిధి

ఆంధ్రా షుగర్స్‌కు బ్రిటిష్ డిప్యూటీ హైకమిషనర్



భారత్‌లోని బ్రిటిష్ డిప్యూటీ హై కమిషనర్ గారెత్ విన్ ఓవెన్ తణుకు ఆంధ్రా షుగర్స్‌ను మంగళవారం సందర్శించారు. కార్యాలయంలో జాయింట్ మేనేజింగ్ డైరెక్టర్ పెండ్యాల నరేంద్రనాథ్, డైరెక్టర్ విక్రమ్ బాబును మర్యాదపూర్వకంగా కలిశారు. - ఇరగవరం

డిప్యూటీ స్పీకర్‌గా ఆర్‌ఆర్‌ఆర్

విప్‌లుగా బొలిశెట్టి, బొమ్మిడి



(భీమవరం-ఆంధ్రజ్యోతి)

తెలుగుదేశం ఉండి ఎమ్మెల్యే రఘురామ కృష్ణరాజుకు డిప్యూటీ స్పీకర్ పదవి వరించ నుంది. కూటమి ప్రభుత్వం ఆ దిశగా కీలక నిర్ణయం తీసుకుంది. అసెంబ్లీలో ఎన్నికద్వారా డిప్యూటీ స్పీకర్ పదవిని నియమిస్తారు. అసెంబ్లీ డిప్యూటీ స్పీకర్‌గా రఘురామరాజు నియామకం లాంఛనప్రాయం కానుంది, వైసీపీ ప్రభుత్వంలో ప్రజాగళం వినిపించి రఘురామరాజు రెబల్ ఎంపిగా మిగిలారు. ఎన్నికల ముందు టీడీపీకి చేరువయ్యారు. ఉండి ఎమ్మెల్యే అభ్యర్థిగా నిలబడి విజయం సాధించారు. తొలుత రఘురామ రాజుకు స్పీకర్ పదవి వస్తుందన్న చర్చ సాగింది. అయ్యన్నపాత్రునికి స్పీకర్ పదవి దక్కింది.

మరోవైపు జిల్లాకు చెందిన ఇద్దరు ఎమ్మెల్యేలను విప్‌లుగా నియమించింది. తాడేపల్లిగూడెం జనసేన ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్, నర్సాపురం జనసేన ఎమ్మెల్యే బొమ్మిడి నాయకర్‌లను నియమిస్తూ ఆదేశాలు జారీ చేసింది. శాసనసభలో చీఫ్ విప్‌తో సహా మరో 15 మంది ఎమ్మెల్యేలను ప్రభుత్వం విప్‌లుగా ప్రకటించారు. అందులో 12 మంది టీడీపీ, ముగ్గురు జనసేన, ఒక బీజేపీ ఎమ్మెల్యేలుగా ఉన్నారు. జనసేనలో ముగ్గురు ఎమ్మెల్యేలలో జిల్లాకు చెందిన ఇద్దరికి ప్రభుత్వం విప్‌లుగా నియమించింది. ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ సూచనలు మేరకే జిల్లాలో జనసేన ఎమ్మెల్యేలకు విప్‌ల కేటగిరిలో ప్రాధాన్యత ఇచ్చారు. బొలిశెట్టి, బొమ్మిడి తొలిసారి ఎమ్మెల్యేలుగా ఎన్నికై అసెంబ్లీలో అడుగు పెట్టారు.

కార్పొరేషన్‌లకు డైరెక్టర్ల నియామకం

నాలుగు పదవులు దక్కించుకున్న ఏలూరు, పశ్చిమ నాయకులు



కళింగ కార్పొరేషన్ డైరెక్టర్‌గా సీతారామాంజనేయులు

ఆకివీడు రూరల్ నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): పెదకాపవరం టీడీపీ నాయకుడు లంబాడి సీతారామాంజనేయులును రాష్ట్ర కళింగ కార్పొరేషన్ డైరెక్టర్‌గా నియమిస్తూ సీఎం చంద్రబాబు ఆదేశాలు జారీ చేశారు. 1999 నుంచి టీడీపీకి అంకితభావంతో పనిచేస్తున్నారు. ప్రస్తుతం యూనిట్ ఇన్‌ఛార్జిగా ఉన్నారు.



ఆర్యవైశ్య కార్పొరేషన్ డైరెక్టర్‌గా మురళి

తాడేపల్లిగూడెం అర్బన్, నవంబరు 12 (నవంబరు): ఆర్యవైశ్య కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్‌గా పట్టణానికి చెందిన తెలుగుదేశం నాయకుడు పద్మనాభుని మురళి నియమితులయ్యారు. టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి వలవల బాబ్జి, కూటమి నాయకులు మురళిని అభినందించారు.



రాష్ట్ర శెట్టి బలిజ కార్పొరేషన్ డైరెక్టర్‌గా చిట్టిబోయిన

జంగారెడ్డిగూడెం, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): జంగారెడ్డిగూడెం పట్టణానికి చెందిన టీడీపీ రాష్ట్ర బీసీ సెల్ కార్యదర్శి చిట్టిబోయిన రామలింగేశ్వరరావు రాష్ట్ర శెట్టి బలిజ కార్పొరేషన్ డైరెక్టర్‌గా నియమితులయ్యారు. ఈ సందర్భంగా పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి దాసరి శ్యామ్ చంద్రశేషు తదితరులు శుభాకాంక్షలు తెలిపారు.

అగ్నికుల క్షత్రియ కార్పొరేషన్ డైరెక్టర్‌గా వాతాడి



నరసాపురం రూరల్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): అగ్నికుల క్షత్రియ కార్పొరేషన్ డైరెక్టర్‌గా వేములదీవి గ్రామానికి చెందిన వాతాడి ఉమాను నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఎమ్మెల్యే నాయకర్, ఇన్‌చార్జి పొత్తూరి రామరాజు, కొవ్వలి నాయుడు, జక్కం శ్రీమన్నారాయణ, గుబ్బల నాగరాజు, కొప్పాడ రవి తదితరులు అభినందనలు తెలిపారు.

మంత్రి లోకేశ్‌ను కలిసిన పేరాబత్తుల



కాకినాడ సిటీ, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర మానవ వనరుల అభివృద్ధి, ఐటీ శాఖ మంత్రి నారా లోకేశ్‌ను అమరావతి సచివాలయంలో తూర్పు-పశ్చిమ ఉమ్మడి గోదావరి జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ కూటమి అభ్యర్థి పేరా బత్తుల రాజశేఖర్ మంగళవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ నియోజ కవర్గ పరిధిలో జరుగుతున్న ఓటర్ల నమోదు ప్రక్రియను రాజశేఖర్ వివరించారు. ఉభయ గోదావరి జిల్లాల కూటమి ఇన్ చార్జి మంత్రులు, జిల్లా మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, జిల్లా అధ్య క్షులు, పార్టీ ఇన్‌చార్జిల సహకార ంతో ఓటరు నమోదు సహాయ కేంద్రాలు ఏర్పాటు చేసి పట్టభద్రులందరికీ అవగాహన కల్పిస్తూ ఓటరు నమోదు జరుగుతుందని తెలియజేశారు

ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థిగా గోపిమూర్తి నామినేషన్



కాకినాడ/ఏలూరు అర్బన్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): తూర్పు- పశ్చిమగోదావరి జిల్లాల ఉపాధ్యాయ ఎమ్మెల్సీ నియోజకవర్గ ఎన్నికలకు సంబంధించి రెండో రోజు మంగళవారం భీమవరానికి చెందిన బొర్రా గోపీమూర్తి కాకినాడ కలెక్టరేట్‌లో నామినేషన్ దాఖలు చేశారు. ఆయన తూర్పు- పశ్చిమగోదావరి జిల్లాల ఉపాధ్యాయ ఎమ్మెల్సీ నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ షాన్‌మోహన్‌కి నామినేషన్ పత్రాలు సమర్పించారు. అనంతరం ధర్నాచౌక్ రోడ్‌లో భారీ బహిరంగ సభ నిర్వహించారు. పీడీఎఫ్ టీచర్ ఎమ్మెల్సీ అభ్యర్థి గోపీమూర్తి మాట్లాడుతూ ఎమ్మెల్సీగా నన్ను గెలిపించిన వెంటనే షేక్‌సాబ్జీ ఆశయాలను సాధించడానికి నిరంతరం పని చేస్తానన్నారు. సభకు యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు వెంకటేశ్వర్లు అధ్యక్షత వహించారు. కృష్ణ, గుంటూరు పీడీఎఫ్ గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ లక్ష్మణరావు, ఎమ్మెల్సీ వెంకటేశ్వరరావు, ఏపీటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు ఉదయబ్రహ్మం పాల్గొన్నారు.

బంగారం.. మతలబు!

- వ్యాపారుల వద్దకు దోచిన, నకిలీ బంగారం
- తాకట్లు పెడుతున్న దొంగలు
- పోలీసు కేసుల్లో ఇరుక్కుంటున్న వ్యాపారులు

భీమవరం క్రైం, నవంబరు 12(ఆంధ్రజ్యోతి):అతివల అందానికి వస్త్రాలతోపాటు బంగారు ఆభరణాలు కూడా ఒక ప్రధాన పాత్ర పోషిస్తాయి. ప్రతి మహిళ బంగారానికి ఎంతో ప్రాధాన్యం ఇస్తుంటారు. వేడుకల్లో ఎవరు ఎక్కువ బంగారు ఆభరణాలు ధరిస్తే వారు ఉన్నతమైన స్థితిలో ఉన్నట్లు నిర్ధారిస్తారు. కానీ ఇటీవల బంగారం ధర రోజురోజుకు పెరుగుతూ రావడంతో దాన్ని ధరించడం కంటే చోరీలు జరుగుతాయేమో అన్న భయం అందరిలోనూ నెలకొన్నది. ఇటీవల జిల్లాలో బంగారం దొంగతనం కేసులు పెరిగాయి. దీంతో బంగారం కొనాలంటేనే చాలా మంది భయపడుతున్నారు. బంగారాన్ని ధరించి వేడుకలకు వెళ్ళాలంటే ఆందోళన చెందే పరిస్థితి నెలకొన్నది. మరో పక్క ఇళ్ళలో భద్రపరిచినా కూడా ఏం జరుగుతుందో అన్న ఆవేదన అందరిలోను మెదులుతున్నది. ఇదంతా ఒక ఎత్తు అయితే ముఖ్యంగా బంగారు వ్యాపారులు కూడా ఎప్పుడు ఏం జరుగుతుందో అన్న ఆందోళనలో ఉంటున్నారు. జిల్లాలో నర్సాపురం, భీమవరం, తాడేపల్లిగూడెం, తణుకు, పాలకొల్లు వంటి పట్టణాల్లో సుమారు 800 వరకు బంగారు దుకాణాలు ఉన్నాయి. అయితే కొంత మంది మర్యాదస్తులుగా వచ్చి బంగారు ఆభరణాలు విక్రయించడం, మరికొందరు ఖాతాదారులు వెంటపెట్టుకుని వచ్చి బంగారం విక్రయించడంతో వ్యాపారస్తులు వాటిని కొనుగోలు చేస్తున్నారు. తరువాత వారు పోలీసులకు పట్టుబడితే పోసుల విచారణలో ఏ దుకాణాల్లో విక్రయించారో చూపించమనడంతో కొనుగోలు చేసిన వ్యాపారులు ఒకటికి మూడింతలు రికవరీ రూపేణా బంగారు వస్తువులు తిరిగి ఇవ్వవలసిన పరిస్థితి నెలకొంటుంది. మరో పక్క బాగా నమ్మిన ఖాతాదారులు కూడా నకిలీ బంగారు వస్తువులు తీసుకువచ్చి తాకట్టు పెడుతూ ఉండటంతో చివరకు వ్యాపారులు భారీగా నష్టపోతున్నారు. ఒక పక్క రికవరీల రూపంలో చెల్లింపులు మరో పక్క నకిలీ బంగారు వస్తువులు తాకట్టులతో తలలు పట్టుకునే పరిస్థితి ఏర్పడుతున్నది.

తాకట్టుకు ఆఫర్లు

ఇటీవల కొన్ని ప్రైవేటు తాకట్టు కంపెనీలు పుట్టగొడుగుల్లా వ్యాపించాయి. మా వద్ద బంగారం తాకట్టు పెట్టండి ఒక గ్రాముకు అధికంగా డబ్బు వడ్డీలకు ఇస్తామంటూ ప్రచారాలు, మరికొన్ని కంపెనీలు మీరు ఎక్కడైనా బంగారు వస్తువులు తాకట్టు పెడితే అవి విడిపించి మేమే కొనుగోలు చేస్తాం అంటూ ప్రచారాలు చెయ్యడంతో కొందరు దొంగలకు ఇదో అవకాశంగా మారుతున్నది. కొట్టేసిన బంగారు ఆభరణాలను కొన్ని ప్రైవేటు కంపెనీల్లో తాకట్టు పెట్టి కొన్నాళ్ళకు అవి విడిపించి కొనేవారికి విక్రయాలు చేసి సొమ్ము చేసుకుంటున్నారు.



మోసాలు చేస్తున్నదిలా..

- నరసాపురం పట్టణంలో ఒక వ్యాపారికి ఒక మహిళ దఫదఫాలుగా బంగారం తాకట్టు పెట్టి సుమారు రూ.60 లక్షలు వరకు తీసుకున్నది. మళ్ళీ ఆ మహిళ బంగారు వస్తువులు తీసుకురాగా ఆ వ్యాపారి స్నేహితుడు పరిశీలించి బంగారు వస్తువులు కాదని చెప్పడంతో ముందుగా పెట్టిన వస్తువులు కూడా పరిశీలించగా అవి కూడా నకిలీ వస్తువులుగా తేలింది.
- భీమవరం పట్టణంలో ఒక వ్యాపారి రెండు సంవత్సరాలు క్రితం ఒక మహిళకు చెందిన సుమారు 8 కాసుల బంగారు వస్తువులు తాకట్టు పెట్టుకున్నాడు. ఈ మహిళ రెండు సంవత్సరాలైనా విడిపించకపోవడం, వడ్డీ కూడా చెల్లించకపోవడంతో ఆవ్యాపారి వస్తువులను తనిఖీ చెయ్యగా నకిలీవని తేలింది. దీంతో మహిళకు ఫోన్ చెయ్యగా ఫోన్‌కు స్పందించ లేదు. ఆ మహిళ అడ్రెస్ కూడా దొరకలేదు.
- తాడేపల్లిగూడెంకు చెందిన ఒక వ్యాపారి బాగా తెలుసున్న ఖాతాదారుని స్నేహితుని వద్ద సుమారు 2 కాసులు బంగారు వస్తువులు కొనుగోలు చేశాడు. అయితే కొద్ది రోజులు తరువాత ఆ వ్యక్తిని తీసుకుని పోలీసులు వచ్చారు. 8కాసులు అమ్మినట్లు చెప్పాడని రికవరీ చేసుకొని వెళ్ళారు. దీంతో ఆ వ్యాపారి ఖంగుతిన్నాడు.
- ఇటీవల ఆకివీడు పట్టణానికి చెందిన ఇద్దరు వ్యక్తులు 400 గ్రాములు బంగారాన్ని దొంగిలించి ఆ బంగారాన్ని ఒక ప్రముఖ కంపెనీలో తాకట్టు పెట్టారు. కొద్ది రోజులు తరువాత ఆ బంగారాన్ని విడిపించి ఒక ప్రముఖ కంపెనీలోని అసిస్టెంట్ మేనేజర్‌కు విక్రయించి సొమ్ము చేసుకున్నారు. ఆ ఇద్దరు దొంగలతో పాటు కంపెనీ అసిస్టెంట్ మేనేజర్ కూడా పోలీసులు అరెస్టు చేశారు.
- పాలకోడేరు మండలానికి చెందిన ఒక ప్రముఖ పార్టీ నేత ఇంట్లో పనిమనిషిగా చేస్తున్న ఒక మహిళ కొద్ది రోజుల క్రితం బంగారు ఆభరణాలు చోరీ చేసి భీమవరం పట్టణంలో ఒక వ్యాపారి వద్ద తాకట్టు పెట్టింది. ఆ మహిళ పోలీసులు విచారణలో పట్టుబడటంతో ఆ వ్యాపారి ఆభరణాలు తిరిగి ఇచ్చేసి చేతులు కాల్చుకునే పరిస్థితి ఏర్పడింది.

వ్యాపారులు జాగ్రత్తలు పాటించాలి

ఆర్‌జీ జయసూర్య (భీమవరం డీఎస్పీ)



బంగారు వ్యాపారులు కొత్తవారి పట్ల, అపరిచితుల పట్ల జాగ్రత్తలు పాటించాలి. ఏదో లాభం కోసం ఆశపడి చాలా వరకు నష్టపోతున్నారు. అలాగే తాకట్టు పెట్టుకునే వారి వద్ద కూడా ఆధార్‌కార్డు, అడ్రస్ వివరాలు తీసుకుని తాకట్టు పెట్టుకోవాలి. ఇలా చాలా మంది మోసపోతున్నారు. బంగారం ధరలు భారీగా పెరిగిపోవడంతో దొంగతనాలు పెరిగాయి. దొంగలు ఇటీవల తెలివితేటలు ఉపయోగించి దొంగిలించిన బంగారాన్ని తాకట్టు పెడుతున్నారు. అది కూడా ప్రైవేటు కంపెనీల్లో ఎక్కువ పెడుతున్నారు. తరువాత వాటినే మరో ప్రైవేటు కంపెనీలకు విక్రయిస్తున్నారు. అలాంటి కేసులు భారీగా పెరిగాయి. దీనిపై వ్యాపారులకు అవగాహన కల్పిస్తాం.

గ్రామాల్లో ట్రైనీ ఆఫీసర్ల పర్యటన



కాళ్ళ మండలంలో పర్యటిస్తున్న ట్రైనీ అధికారులు

కాళ్ళ/ఉండి/, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి) : కాళ్ళ మండలం ప్రాతాళ్ళమెరక గ్రామంలో మంగళవారం ట్రైనీ ఆఫీసర్ల బృందం పర్యటించారు. ముస్సోరిలోని లాల్ బహదూర్ శాస్త్రీ నేషనల్ అకాడమి నుంచి వచ్చిన కాత్యాయని సింగ్ ఐఎఫ్ఎస్, శ్రీకృష్ణశ్రీరామ్ సుధీర్ ఐఏఎస్, లక్ష్మణ్ ఆనంద్ ఐఎఫ్ఎస్, భగత్‌శ్యామల్ కళ్యాణరావ్ ఐఏఎస్, రూపాలి సురాణా ఐఆర్ఎస్ (ఐటీ)లు ఫీల్డ్ స్టడీ కార్యక్రమంలో భాగంగా ప్రాతాళ్లమెరక గ్రామంలో క్షేత్రస్థాయిలో పర్యటించారు. ఒకే ఆవరణలో కట్టిన సచివాలయం భవనాలను పరిశీలించారు. అనంతరం గ్రామంలో మంచినీటి చెరువు, రక్షిత మంచినీటి సరఫరా కేంద్రం, అంగన్‌వాడీ కేంద్రం, మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలను పరిశీలించారు. గ్రామస్తులతో మాట్లాడి వారి జీవన శైలిని అడిగి తెలుసుకున్నారు. పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రంలోని విద్యార్థులతో మాట్లాడి ముచ్చటించారు.

- శిక్షణ కార్యక్రమంలో భాగంగా ట్రైనీ అధికారుల బృందం ఉండి మండలం మహదేవపట్నంలో పర్యటించారు. జడ్పీహైస్కూల్‌లో 10వతరగతి విద్యార్థులతో కొద్దిసేపు మమేకమయ్యారు. మీవిద్య పూర్తయిన తరువాత ఎంతమంది ఐఏఎస్, ఐపీఎస్‌లకు వెళ్తారు అని ప్రశ్నించగా పలువురు తమ ఆసక్తిని తెలిపారు. గ్రామంలో మంచినీటి చెరువును, పొలాలను పరిశీలించారు.
- ట్రైనీ అధికారుల బృందం మంగళవారం కలెక్టరేట్‌లో జేసీ టి.రాహుల్ కుమార్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలుసుకున్నా రు. ఈ సందర్భంగా జిల్లా నైసర్గిక స్వరూపం, విస్తీర్ణం, మండలాలు, జనాభా, ప్రధాన పంటల సాగు, వివిధ శాఖలలో అమలు జరుగుతున్న సంక్షేమం, అభివృద్ధి కార్యక్రమాలను జేసీ తెలియజేశారు.

దరఖాస్తుల ఆహ్వానం

ఏలూరు క్రైం, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి) : ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలో ఖాళీగా ఉన్న సెకండ్ క్లాస్ స్పెషల్ జ్యుడీషియల్ మెజిస్ట్రేట్ పోస్టులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా ప్రధాన న్యాయమూర్తి సి.పురుషోత్తమకుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. 9 పోస్టులు ఖాళీగా ఉన్నాయ న్నారు. ఏలూరు -2, కొవ్వూరు -2, తణుకు, తాడేపల్లి గూడెం, నర్సాపురం, పాలకొల్లు, జంగారెడ్డిగూడాలలో ఒక్కొక్క పోస్టు ఖాళీగా ఉన్నాయన్నారు. తాత్కాలిక పద్ధతిపై ఈ పోస్టులు భర్తీ చేయడం జరుగుతు ందన్నారు. నవంబర్ 25వ తేదీ సాయంత్రం 5 గంటల వరకూ దరఖాస్తులను స్వీకరిస్తామన్నారు. పూర్తి వివరా లు జిల్లా కోర్టు నోటీసు బోర్డులోనూ, ప్రిన్సిపల్ డిస్ట్రిక్ట్ కోర్టు వెబ్‌సైట్‌లో ఉంటాయన్నారు.

క్రైమ్ కార్నర్

ఉరి వేసుకుని ట్రాక్టర్ డ్రైవర్ అనుమానాస్పద మృతి

పాలకోడేరు, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): పెన్నాడకు చెందిన ట్రాక్టర్ డ్రైవర్ అరుగుల కృష్ణ (46) ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడని పాలకోడేరు ఏఎస్ఐ ఐవీఎస్ఎస్ఎన్ మోహనరావు తెలిపారు. ఇతని భార్య 20 సంవత్సరాల క్రితం మృతి చెందిందన్నారు. కృష్ణ తన ఇద్దరు కుమారులతో కలసి ట్రాక్టర్ పనిచేసుకుంటూ జీవిస్తూ ఉంటాడని తెలిపారు. కొంత కాలం క్రితం పెద్ద కుమారుడుకి వివాహమైంది. ఈనెల 5వ తేదీన బయటకు వెళ్ళిన కృష్ణ ఇంటికి తిరిగి రాలేదు. పెన్నాడపాలెంలోని బ్రాందీషాపు దగ్గరలో ఉన్న పాకలో ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడని తెలిపారు. ఇతను మృతి చెంది మూడు, నాలుగు రోజులై ఉండవచ్చునని పోలీసులు, స్థానికులు చెబుతున్నారు. దీనిపై కుమారుడు పవన్ కుమార్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసినట్టు పోలీసులు తెలిపారు.

మహిళా పోలీసు మెడలో గొలుసు చోరీ

జంగారెడ్డిగూడెం, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఓ సచివాలయ ంలో మహిళా పోలీసుగా పని చేస్తున్న తగరం ఎస్తేరు రాణి ప్రభుత్వ డిగ్రీ కళాశాల వద్ద నివాసముంటున్నారు. మంగళవారం రాత్రి ఆమె తన ఇంటి నుంచి త్రివేణి రోడ్డు మీదుగా ఉప్పలమెట్ట ఏరియాకు స్కూటీ డ్రైవ్ చేసుకుంటూ వెళ్తున్నారు. ఆమె వెనుక పల్సర్ ద్వి చక్ర వాహనంపై ఒక యువకుడు ఫాలో అయ్యాడు. త్రివేణి కళాశాల రోడ్డుకు వచ్చే సరికి చీకటిగా ఉండడంతో ఆమె మెడలో ఉన్న ఐదు కాసుల పుస్తెల తాడును లాక్కుని పారిపోయాడు. ఈ ఘటనలో ఎస్తేరు రాణి కింద పడిపోగా ఆమెకు స్వల్ప గాయాలయ్యాయి. డీఎస్పీ యు.రవిచంద్ర, సీఐ కృష్ణబాబు, ఎస్సై జబీర్ సంఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు.

ద్విచక్ర వాహనాల దొంగ అరెస్టు

23 వాహనాలు స్వాధీనం



దొంగను అరెస్టు చేసి వివరాలు చెబుతున్న డీఎస్పీ రవిచంద్ర

జంగారెడ్డిగూడెం, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): జల్సాలకు అలవాటు పడి ద్విచక్ర వాహనాలను దొంగిలించి అమ్ముకునే తూర్పు గోదావరి జిల్లా గోపాలపురం మండలం కరిచర్లగూడెం గ్రామానికి చెందిన పల్లంటి శ్రీనివాస్ అలియాస్ శ్రీనును అరెస్టు చేసి అతని నుంచి రూ.పది లక్షల విలువ చేసే 23 ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నట్లు డీఎస్పీ యు.రవిచంద్ర తెలిపారు. మంగళవారం స్థానిక పోలీసు స్టేషన్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన వివరాలను వెల్లడించారు. ప్రస్తుతం పట్టణంలోని రామచంద్రాపురంలో నివసిస్తున్న పల్లంటి శ్రీనివాస్ పలు ప్రాంతాల్లో 23 ద్విచక్ర వాహనాలను దొంగిలించి పట్టణ శివారు బైనేరు వంతెన సమీపంలో పొదల్లో దాచాడు. వీటిని పోలీసులు స్వాధీన పరుచుకున్నారు. ఇతను పాత నేరస్తుడని, ఇతనిపై సత్తుపల్లిలో కూడా కేసులున్నాయని, నేరాలు చేసి జైలుకు కూడా వెళ్ళి వచ్చాడన్నారు. అతని పాత నేర చరిత్రను దృష్టిలో పెట్టుకుని అతన్ని అదుపులోకి తీసుకుని విచారించి వివరాలు రాబట్టినట్లు తెలిపారు. సమావేశంలో సీఐ కృష్ణబాబు, ఎస్సై ఎస్‌కె. జబీర్, ఏఎస్సైలు ఎన్‌వి.సంపత్ కుమార్, ఎన్.రాజేంద్ర ప్రసాద్, పీసీ రాజశేఖర్ పాల్గొన్నారు.



దొంగలను అరెస్టు చేసి విలేకర్లతో మాట్లాడుతున్న సీఐ జి.దుర్గాప్రసాద్

ముగ్గురు దొంగల అరెస్టు

రూ.1.48 లక్షల విలువైన బంగారం స్వాధీనం

నరసాపురం రూరల్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): ముగ్గురు దొంగల్ని అరెస్టు చేసినట్లు రూరల్ సీఐ జి. దుర్గాప్రసాద్ చెప్పారు మంగళవారం రూరల్ స్టేషన్‌లో ఎస్సై వెంకట సురేష్‌తో కలిసి విలేకర్లతో మాట్లాడారు. ఈనెల 8న రాత్రి చిట్టవరం గ్రామంలో కుడిపూడి నాగలక్ష్మి నివాసంలో దొంగతనం జరిగిందన్నారు. మరునటి రోజు ఆమె ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామన్నారు. దర్యాప్తులో భాగంగా గ్రామంలో మంగళవారం అనుమానాస్పదంగా తిరుగుతున్న రాజోలు మండలం మలికిపురంకు చెందిన గొమ్మేటి గోపినాథ్, పాలకొల్లు మండలం దిగమర్రుకు చెందిన వీరవల్లి పవన్ కుమార్, చిట్టవరం గ్రామానికి చెందిన కోళ్ళ సుజాతలను అదుపులోకి తీసుకుని విచారించగా వీరి వద్ద నుంచి రూ.1.48లక్షల విలువల చేసే 50.74 గ్రాముల బంగారం, రూ.3190 నగదు స్వాధీనం చేసుకున్నామన్నారు. వీరిని కోర్టుకు హాజరుపర్చాగా రిమాండ్ విధించినట్లు సీఐ చెప్పారు.

దొంగ అరెస్టు

అత్తిలి, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి) : అత్తిలి పోలీస్ స్టేషన్ పరిధిలో ఒక కేసులో నిందితుడైన ఖండవల్లి సీతారాముడును సోమవారం రాత్రి అదుపులోకి తీసుకుని అతని వద్ద నుంచి ఐదున్నర కాసుల బంగారం, 275 గ్రాముల వెండిని రికవరీ చేసినట్లు ఎస్ఐ పి ప్రేమరాజు తెలిపారు. నిందితుడిని రిమాండ్ నిమిత్తం తణుకు కోర్టులో హాజరు పరిచినట్లు తెలిపారు.

రూ.20 వేలు పంపించి రూ.46 లక్షలు కొట్టేశారు..!

ఏలూరు క్రైం, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): సైబర్ నేరగాళ్ల వలలో చిక్కి ఒక వ్యక్తి 46 లక్షల 30 వేల రూపాయలు పోగొట్టుకున్నాడు. అశోక్‌నగర్‌కు చెందిన కె.శేషగిరి ప్రసాద్‌కు ఈ నెల 8వ తేదీన ఒక గుర్తు తెలియని వ్యక్తి ఆయన అకౌంట్‌కు 20 వేల రూపాయలను పంపించారు. పొరపాటున వచ్చాయని తిరిగి వాటిని వేయాలని ప్రాధేయపడి అడిగాడు. ఆ మాటలు నమ్మిన శేషగిరి ప్రసాద్ తిరిగి ఆన్‌లైన్ ద్వారా పంపించారు. ఈ నెల 10న తన అకౌంట్‌ను పరిశీలించగా 46 లక్షల 30 వేల రూపాయలను సైబర్ నేరగాళ్లు అపహరించారని గుర్తించారు. ఏలూరు టూటౌన్ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో టూటౌన్ సీఐ వైవి రమణ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. సైబర్ నేరగాళ్ల విషయంలో అప్రమత్తంగా ఉండాలని పోలీసులు హెచ్చరిస్తున్నారు.

రైలు పట్టాలపై గుర్తు తెలియని మృతదేహం



ఏలూరు క్రైం, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి) :ఏలూరు రైల్వే స్టేషన్ పరిధిలోని వట్లూరు రైల్వేస్టేషన్ దగ్గర సుమారు 20 నుంచి 25 సంవత్సరాలు కల్గిన ఒక యువకుడు మృతి చెంది ఉన్నాడు. ఇతడిని గరీబ్‌రథ్ ఎక్స్‌ప్రెస్ రైలు ఢీ కొంది. అతను సుమారు 5.7 అడుగులు ఎత్తు కల్గి, తెలుపు రంగు శరీరం, నలుపురంగు పొడవు చేతుల టీషర్టు, గోధుమ రంగు షార్టు ధరించి ఉన్నాడు. అనుమానాస్పద మృతిగా నమోదు చేసి మృత దేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఏలూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. మృతుని వివరాలు తెలిసిన వారు ఏలూరు రైల్వే ఎస్ఐ సైమన్ సెల్ నెంబర్ 9989219559కు సమాచారం అందించాలని రైల్వే పోలీసులు కోరారు.

చికిత్స పొందుతూ యువకుడి మృతి

ఏలూరు క్రైం, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి) : ఏ కారణమో తెలియదు కాని పురుగు మందు తాగి యువకుడు తీవ్ర అస్వస్థతకు గురై ఏలూరు ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. చాట్రాయి మండలం కోటపాడు గ్రామానికి చెందిన పర్సా భరత్‌కుమార్ (18) ఈనెల 11వ తేదీన పురుగు మందుతాగి తీవ్ర అస్వస్థతకు గురయ్యాడు. చింతలపూడి ప్రభుత్వాసుపత్రికి ఏలూరు ప్రభుత్వాసుపత్రికి తీసుకువచ్చారు. మంగళవారం ఉదయం మృతి చెందాడు.

అత్యాచారం చేశాడంటూ బాలిక ఫిర్యాదు

బుట్టాయగూడెం, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): మెరకగూడెంకు చెందిన వ్యక్తి తనపై అత్యాచారం చేశాడని మండలంలోని ఒక గ్రామానికి చెందిన గిరిజన బాలిక మంగళవారం పోలీసులకు ఫిర్యాదు చేసింది. ప్రేమిస్తున్నానంటూ వెంటబడి పెళ్ళి చేసుకుంటానని గర్భవతిని చేసి మోసం చేశాడని ఫిర్యాదులో పేర్కొంది. ఎస్సై దుర్గా మహేశ్వరావు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.

పోలీసుల అదుపులో వైసీపీ సోషల్ మీడియా యాక్టివిస్టులు

ఏలూరు క్రైం, నవంబరు 12(ఆంధ్రజ్యోతి):ఏలూరు జిల్లాకు చెందిన జనసేన నాయకుడు ఇచ్చిన ఫిర్యాదుతో ఏలూరు వన్‌టౌన్ పోలీసులు, రూరల్ పోలీసులు కొంత మంది వైసీపీ సోషల్ మీడియా యాక్టివిస్టులను అదుపులోకి తీసుకుని విచారిస్తున్నట్లు సమాచారం. విశాఖపట్నానికి చెందిన ఒక మహిళను కూడా వన్‌టౌన్ పోలీసులు అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు. ఆమెను అరెస్టు చేయడానికి రంగం సిద్ధం చేశారు. అయితే ఈ విషయాలను అధికారులు గోప్యంగా ఉంచుతున్నారు.

నేత్రపర్వంగా శ్రీవారికి ఏకాదశి ఉత్సవం



ద్వారకాతిరుమల, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): ఉభయదేవేరులతో చినవెంకన్నకు మంగళవారం రాత్రి జరిగిన ఏకాదశి ఉత్సవం భక్తులను అలరించింది. ముందుగా ఆలయంలో స్వామి, అమ్మవార్లను తొళక్కవాహనంపై ఉంచి ప్రత్యేక పుష్పాలంకరణ చేశారు. అనంతరం మేళతాళాలు, మంగళ వాయిద్యాల నడుమ ఆలయ ప్రధాన రాజగోపురం మీదుగా తిరువీధులకు తీసుకొచ్చారు.

బాల్య వివాహ నిషేధ అధికారులుగా ఎంఈవోలు

ఏలూరు అర్బన్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో బాల్య వివాహాల నిరోధానికి కలెక్టర్ ఏర్పాటు చేసిన వివిధ శాఖల అధికారులతో సమన్వయ సమావేశం మంగళవారం స్థానిక ఎంఈవో కార్యాలయంలో జరిగింది. నోడల్ అధికారి, ఐసీడీఎస్ పీడీ పద్మావతి మాట్లాడుతూ బాల్య వివాహ నిషేద అధికారులుగా నియమితులైన ఎంఈవోల విధులను వివరించారు. బాలల సంరక్షణాధికారి సూర్యచక్రవేణి, డీఈవో కార్యాలయ ఏడీ-2 షరీఫ్, సమగ్రశిక్ష సెక్టోరల్ అధికారులు రాధాకృష్ణ, డీవైఈవోలు, ఎంఈవోలు, తదితరులు పాల్గొన్నారు.

బాల్య వివాహాల చట్టాలపై అవగాహన

జంగారెడ్డిగూడెం, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి) : బాల్య వివాహాల చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని జిల్లా బాలల సంరక్షణ అధికారిణి డాక్టర్ సిహెచ్.సూర్య చక్రవేణి అన్నారు. స్థానిక రోటరీ క్లబ్‌లో మంగళవారం బాల్య వివాహాల చట్టాలపై మహిళా సంరక్షణ కార్యదర్శులు, అంగన్‌వాడీ, ఆశ వర్కర్లకు అవగాహనా కార్యక్రమం ఐసీడీఎస్ సీడీపీఓ పి.బ్యూలా అధ్యక్షతన జరిగింది. ఎంపీడీవో కృష్ణ ప్రసాద్, డీఎల్‌డీవో ఎం.రాజు, సోషల్ వర్కర్లు, పంచాయతీ కార్యదర్శులు, అంగన్‌వాడీ, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

ఘనంగా బాలల దినోత్సవం

నిడమర్రు, నవంబర్ 12 (ఆంధ్రజ్యోతి): పెదనింద్రకొలను ఉన్నత పాఠశాలలో మంగళవారం లయన్స్ క్లబ్ స్పిరిట్ తాడేపల్లిగూడెం ఆధ్వర్యంలో బాలల దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. విద్యార్థులకు చిత్రలేఖనం, చదరంగం పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. లయన్ క్లబ్ అధ్యక్షుడు శ్యామ్ జూనియర్ ప్రోగ్రామర్ వంశీ, మాజీ అధ్యక్షుడు వీర వెంకయ్య, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నైపుణ్యాలతోనే ఉద్యోగాలు

ఏలూరు అర్బన్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): డిగ్రీలో సాధించిన మార్కుల ఆధారంగా ఉద్యోగాలు తెచ్చుకునే రోజులకు కాలం చెల్లిందని, కాలానుగుణంగా నైపుణ్యాలు సాధించిన విద్యార్థులే పోటీ ప్రపంచంలో నిలదొక్కుకోగలుగుతారని బెంగళూరు గీతం స్కూల్ ఆఫ్ బిజినెస్ ప్రొఫెసర్ ఎంవీ రామ్‌ప్రసాద్ పేర్కొన్నారు. ఉద్యోగ లక్ష్యాలు అనే అంశంపై మంగళవారం స్థానిక సీఆర్‌ఆర్ పీజీ కళాశాలలో అవగాహన సదస్సు జరిగింది. ఇంగ్లీషుపై పట్టు, వార్తాపత్రికలు చదివే అలవాటు చేసుకోవాలని సూచించారు. ఆయనను కళాశాల యాజమాన్యం సత్కరించింది. కరస్పాండెంట్ కె.శ్రీనివాసరావు, డైరెక్టర్ వై.బాబు, ఎంబీఏ విభాగాధిపతి శ్రీనివాసరావు, టి.రాజేష్, సౌజన్య, రత్నాకర్, అపర్ణ తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ చార్జీల పెంపుపై ఖండన

ఏలూరు కార్పొరేషన్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ చార్జీలను పెంపుదలపై రాష్ట్ర యువజన కాంగ్రెస్ అధికార ప్రతినిధి రాయల సతీష్, జనరల్ కార్యదర్శి రామ్‌సింగ్ మంగళవారం ఒక ప్రకటనలో ఖండించారు. విద్యుత్ చార్జీలు పెంచడం వలన ప్రజలపై అదనపు భారం పడుతుందన్నారు. విద్యుత్ చార్జీల సర్దుబాటును వెంటనే రద్దు చేయాలన్నారు. లేనిఎడల రాష్ట్ర వ్యాప్తంగా పోరాటం చేయాల్సి వస్తుందని హెచ్చరించారు.

పౌష్టికాహారం తీసుకోవాలి

లింగపాలెం, నవంబరు12 (ఆంధ్రజ్యోతి): గర్భిణులకు పౌష్టికాహారం తీసుకుంటే పుట్టే బిడ్డ సంపూర్ణ ఆరోగ్యంగా ఉంటారని డాక్టర్ యానిప్రీతి సూచించారు. ధర్మాజీగూడెంలో మంగళవారం వైద్య శిబిరం నిర్వహించారు. గర్భిణులకు ప్రత్యేక వైద్య పరీక్షలు నిర్వహించి, ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ చూపాలన్నారు. జ్వర లక్షణాలు కనిపిస్తే హైరిస్క్‌గా పరిగణించి వైద్యులను సంప్రదించాలన్నారు. సాధారణ ప్రసవాలు పీహెచ్‌సీలో జరిగేలా సిబ్బంది చర్యలు తీసుకోవాలని అన్నారు.

'ఉల్లాస్'పై అవగాహన

దెందులూరు, నవంబరు12 (ఆంధ్రజ్యోతి): నిరక్షరాస్యులను అక్షరాసులుగా మార్చి, జ్ఞానవంతులుగా తీర్చిదిద్దెందుకు కేంద్ర ప్రభుత్వం ఉల్లస్ కార్యక్రమాన్ని దేశమంతటా అమలు చేస్తుందని దెందులూరు ఎంపీడీవో కె.శ్రీదేవి తెలిపారు. ఎంపీడీవో కార్యాలయంలో మంగళవారం మండల విద్యాశాఖ అధికారులు, మండలంలో అన్ని శాఖల అధికారులతో ఉల్లస్ కార్యక్ర మంపై ఎంపీడీవో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. వయోజన విద్య శాఖ ద్వారా మండలంలో ఉన్న 270 మంది అభ్యాసకులను గుర్తించి వారికి బోధించుటకు 27 మంది వలంటీర్లకు శిక్షణ ఇసున్నారన్నారు. జిల్లా వయోజన విద్య అసిస్టెంట్ అధికారి ఆర్.విజయకుమార్ పాల్గొన్నారు.

జనవరి 5న హైందవ శంఖారావం

భీమడోలు, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి) : హిందూ దేవాలయాల రక్షణ కోసం జనవరి 5న విజయవాడలో నిర్వహిస్తున్న హైందవ శంఖారావం బహిరంగ సభకు హిందువులు తరలిరావాలని శంఖారావం జిల్లా ప్రముఖ్ వంశీ పిలుపునిచ్చారు. భీమడోలులోని కాద్రగడ్డ కల్యాణ మండపంలో మంగళవారం ఉంగుటూరు ఖండ సన్నాహక సమావేశం నిర్వహించారు. 10 హిందూ సంఘాల ప్రతినిధులు, విశ్వహిందూ పరివాహక క్షేత్రాలకు చెందిన ప్రతినిధులు హాజరయ్యారు. జిల్లా ప్రచారక్ విశ్వనాద్, జయరాజు, శరణాల మాలతీరాణి, శోభారాణి, తదితరులు పాల్గొన్నారు.

ఈ రోడ్డుకు మోక్షం ఎప్పుడు?

» ప్రమాదకరంగా రహదారులు » వాహనాలన్నీ ఒక వైపే రాకపోకలు

చింతలపూడి, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి) : చింతలపూడి-జంగారెడ్డిగూడెం రోడ్డు భారీ గోతులతో అధ్వానంగా మారింది. ఊరు వెలుపల నుంచి టి.నర్సాపురం పది కిలోమీటర్ల దూరం వెళ్లాలంటే అత్యంత ప్రమాదకంగా గోతులు ఉన్నాయి. కనీసం గోతులు కూడా పూడ్చడంలేదు. రాత్రివేళ ప్రయాణించాలంటే భయపడుతున్నారు. ఈ మార్గంలో ఆర్టీసీ బస్సులు నడపడం అధికారులకు కత్తిమీద సాములా మారింది. ముఖ్యమైన పనులు ఉంటేనే తప్ప చింతలపూడికి ప్రజలు రావడం తగ్గించారు. దీనికితోడు చింతలపూడి శివారులో రోడ్డు పక్కనే నగర పంచాయతీ చెత్తను వేయడంతో ప్రజలు దుర్వాసన భరించలేకపోతున్నారు. ఈ చెత్తను ఒక్కోసారి తగులబెడుతున్నప్పుడు పొగతో ఇటుగా వెళ్లే ప్రయాణికులు ఇబ్బంది పడుతున్నారు.



గోతులు, కంపోస్టుతో అధ్వానంగా ఉన్న టి.నర్సాపురం రోడు

ఆక్రమణల జోరు

ఈ మార్గాల్లో రోడ్డుకిరువైపులా ఆక్రమణలు పెరిగాయి. వ్యవసాయ భూములున్న వారు కొందరు ముందుకు వచ్చి కంచెలు వేస్తున్నారు. రోడ్ల పక్కనే పశువులను కడుతున్నారు. దుకాణాలు కూడా రోడ్ల పక్కనే ఏర్పాటు చేయడం వలన పెరిగిన వాహనాలకు తోడు ఈ ఆక్రమణల వలన రాకపోకలకు ఇబ్బందిగా మారింది.

రోడ్లు ప్రమాదకరంగా ఉన్నాయి



చింతలపూడి నుంచి ఎటువైపు వెళ్లాలన్నా రోడ్లన్నీ ప్రమాదకరంగా ఉన్నాయి. కనీసం గోతులు పూడ్చడం లేదు. వర్షాకాలం వెళ్లింది. పటిష్టమైన కొత్త రోడ్లు వేయాలి. పల్లె రోడ్లు, ప్రధాన రోడ్లు ఈ విధంగానే ఉన్నాయి.

- తుర్లపాటి బాబు, చింతలపూడి

వాహనాలన్నీ ఒకవైపే..

చింతలపూడి తెలంగాణ రాష్ట్ర సరిహద్దులో ఉంది. చింతలపూడి నుంచి తెలంగాణ రాష్ట్రంలోకి వెళ్లాలంటే నాలుగు లూప్‌లైను రహదారులు ఉన్నాయి. ఇందులో గురుభట్లగూడెం రోడ్డు, సీతానగరం రోడ్డు, అల్లిపల్లి రోడ్డు, శివపురం రోడ్డు ఉన్నాయి. సీతానగరం రోడ్డులో ఎర్రగుంటపల్లి వరకు అడుగడుగునా గోతులమయం. రేచర్ల మలుపులో ద్విచక్ర వాహనాలు నడపలేని పరిస్థితి. ఎంతో మంది ప్రతిరోజు ఈ గోతుల్లో పడి గాయాలపాలవుతున్నారు. ఈ మార్గంలోనే పామాయిల్ ఫ్యాక్టరీ ఉంది. నిత్యం వందలాది లారీలు రాకపోకలు సాగిస్తుంటాయి. గోతులతో ప్రమాదకరంగా ఉన్న ఈ మార్గంలో గత రెండు నెలలుగా బస్సులుగాని, పామాయిల్ గెలలు తరలించే లోడు లారీలు గాని వెళ్లడంలేదు. అన్ని వాహనాలు గురుభట్లగూడెం మీదుగా తెలంగాణ రాష్ట్రం రోడ్డు ఎక్కి తిరిగి సీతానగరం ఫ్యాక్టరీకి లోడు లారీలు రాకపోకలు సాగిస్తున్నాయి. హైదరాబాదు, భద్రాచలం, మణుగూరు వెళ్ళే సూపర్ లగ్జరీ ఎక్స్‌ప్రెస్ బస్సులు గురుభట్లగూడెం వైపే ప్రయాణిస్తున్నాయి. అయితే ఎర్రగుంటపల్లి గ్రామానికి చెందిన నాయకులు, ప్రజలు బస్సులు ఇటువైపు తిప్పండని కోరుతున్నా ఆర్టీసీ అధికారులు తమ వల్ల కాదంటున్నారని గ్రామస్తులు తెలిపారు. అయితే రెండు మార్గాల్లో వెళ్లే వాహనాలు, గురుభట్లగూడెం వైపు రాకపోకలు సాగిస్తుండడంతో రద్దీ పెరిగింది. ఈ మార్గంలో కూడా సమ్మెటవారిగూడెం వరకు చిన్నపాటి గోతులు చాలా ఉన్నాయి. ప్రమాదాలు జరగకముందే గోతులను పూడ్చాలని వాహనదారులు, ప్రజలు కోరుతున్నారు.

నేడు ఎంపీ మహేశ్ పర్యటన

ఏలూరు టూ టౌన్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): ఏలూరు ఎంపీ పుట్టా మహేశ్ కుమార్ బుధవారం భీమడోలు, ఏలూరు మండలాల్లో పర్యటిస్తారు. భీమడోలు మండలం ఆగడాలలంకలో ఉదయం 10.30 గంటలకు అంబేడ్కర్ విగ్రహాన్ని ఆవిష్కరిస్తారు. అనంతరం ఏలూరు శాంతినగర్ ఎంపీ క్యాంపు కార్యాలయంలో ఉదయం 11.30 నిమిషాలకు ప్రజల నుంచి వినతులు స్వీకరిస్తారు. ప్రజల సమస్యలు తెలుసుకుంటారు.

రేపు మండల స్థాయి శిక్షణ తరగతులు

టి.నరసాపురం, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో గురువారం అన్ని శాఖల అధికారులు, సిబ్బందికి ఒక్కరోజు శిక్షణ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో వెంకటేశ్వరరావు మంగళవారం తెలిపారు. అన్ని గ్రామ పంచాయతీల్లో 2025-26 వార్షిక ప్రణాళికలను తయారు చేసే క్రమంలో మండలస్థాయిలో స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించు శిక్షణా కార్యక్రమానికి మండల స్థాయి అధికారులు, గ్రామ పంచాయతీ సిబ్బంది హాజరు కావాలని సూచించారు.

రేపు ఆయుష్ వాక్‌థాన్

ఏలూరు అర్బన్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): ప్రపంచ మధుమేహవ్యాధి దినాన్ని పురస్కరించుకుని గురువారం నగరంలో పది వేల అడుగులతో కూడిన వాక్‌థాన్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్టు ఏలూరు ఆయుష్ హాస్పిటల్స్ మేనేజర్ కాశీనాథ్ జాస్తి తెలిపారు. ఆ రోజున ఉదయం 6 గంటలకు ఎమ్మెల్యే బడేటి చంటి సీఆర్‌ఆర్ కళాశాల క్రీడా మైదానంలో వాక్‌థాన్‌ను ప్రారంభిస్తారని ఆయుష్ ఆస్పత్రి వరకు 10వేల అడుగుల నడక ఉంటుందని వివరించారు.

రేపటి నుంచి గ్రంథాలయ వారోత్సవాలు

లింగపాలెం, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): గ్రంథాలయ వారోత్సవాలను గురువారం నుంచి నిర్వహిస్తున్నామని గ్రంథాలయ అధికారి సిహెచ్ వెంకటరమణ, ఎస్ఏ లతీఫ్ తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులకు పలు అంశాలపై పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేస్తామన్నారు.

డిసెంబర్ 14న మెగా లోక్ అదాలత్

చింతలపూడి, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి) : పెండింగ్ కేసులు పరిష్కారానికి డిసెంబర్ 14న జరిగే మెగా లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలని స్థానిక జూనియర్ సివిల్ న్యాయాధికారి సిహెచ్.మధుబాబు సూచించారు. మంగళవారం కోర్టు ఆవరణలో న్యాయవాదులతో లోక్ అదాలత్‌పై అవగాహన నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ రాజీపడతగ్గ క్రిమినల్, సివిల్, బ్యాంకు రికవరీ, చెక్ బౌన్స్ కుటుంబ తగాదాలు, మనోవర్తి, ప్రాంశరీ నోటు కేసులు పరిష్కరించుకోవాలన్నారు. దీనివలన డబ్బు, సమయం ఆదా అవుతుందన్నారు. బార్ అసోసియేషన్ అధ్యక్షుడు బి.నాగేశ్వరరావు, న్యాయవాదులు పాల్గొన్నారు.

రాష్ట్ర బడ్జెట్‌తో రైతుల కలల సాకారం



ఘంటా మురళీ

జంగారెడ్డిగూడెం, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): మెట్ట ప్రాంత రైతుల కలల సాకారం చేసే దిశగా మొదటి బడ్జెట్ లోనే చింతలపూడి ఎత్తిపోతల పథకానికి నిధులు కేటాయించడం అభినందనీయమని చింతలపూడి మాజీ ఎమ్మెల్యే ఘంటా మురళీ రామకృష్ణ మంగళవారం ఒక ప్రకటనలో అన్నారు. గత వైసీపీ ప్రభుత్వం చింతలపూడి ఎత్తిపోతల పథకాన్ని నిర్వీర్యం చేయడమే కాకుండా ఒక్క రూపాయి కూడా విదల్చ లేదన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే రైతుల ఆశలను నెరవేర్చేందుకు ముందుకు వెళ్తుందన్నారు .ఇది పక్కా రైతుల ప్రభుత్వ మన్నారు.

దళిత గిరిజనులకు భూమి పంచాలి

జంగారెడ్డిగూడెం, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి) : అర్హులైన ప్రతీ దళిత, గిరిజనుల కుటుంబానికి రెండెకరాల భూమి పంచాలని సీపీఎం జిల్లా కార్యదర్శి ఎ.రవి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మైసన్నగూడెం గ్రామంలో మంగళవారం సీపీఎం జంగారెడ్డిగూడెం మండల 15వ మహాసభలు జరిగాయి. రవి మాట్లాడుతూ దేశంలో బీజేపీ సనాతన ధర్మం, మనువాదాలను తీసుకువచ్చి ప్రజల్లో చిచ్చుపెడుతుందన్నారు. నాయకులు ఎం.జీవరత్నం, డీఎన్‌వీడీప్రసాద్, సూర్యారావు, బి.రాంబాబు, పీఎస్ రావు, జోడి సూర్యచంద్రం, సూర్యకిరణ్, ప్రభాకరరావు, వీర్రాజు తదితరులు పాల్గొన్నారు.

సేంద్రియ వ్యవసాయంపై దృష్టి సారించండి

పొలం పిలుస్తోందిలో అధికారులు

నిడమర్రు నవంబర్ 12 (ఆంధ్రజ్యోతి) : వాతావరణ పరిస్థితులను అంచనా వేసుకొని రైతులు తమ ధాన్యంను రైతు సేవాకేంద్రాల ద్వారా నచ్చిన మిల్లుకు తోలుకోవచ్చని ఏవో ఎస్.గీతాదేవి అన్నారు.ఎనికేపల్లి రైతు సేవా కేంద్రంలో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమంలో రైతులతో ఆమె మాట్లాడారు. రైతులు, వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

● లింగపాలెం : రసాయన ఎరువులు తగ్గించి సేంద్రియ సాగుపై దృష్టి సారించాలని జిలా వ్యవసాయ అధికారి హబీబ్‌భాషా సూచించారు.



జీలుగుమిల్లిలో ఏవో గంగాధరం,సిబ్బంది

నరసన్నపాలెం, తువ్వచిలుక రాయుడు పాలెం గ్రామాలలో పొలంపిలుస్తుంది కార్యక్రమం నిర్వహించారు. రైతులతో కలసి పొలాలను పరిశీలించారు. పొగాకుకు ప్రత్యామ్నాయంగా మొక్కజొన్న, అపరాల పంటలపై దృష్టి సారించాలన్నారు. ఏవో మురళీ కృష్ణ ఏడీఏ నాగకుమార్, ఉద్యాన అధికారిణి షాఫియా ఫర్హీన్, పశువైద్యాధికారి మహేష్, రైతులు సిబ్బంది పాల్గొన్నారు.

● జీలుగుమిల్లి : తాటియాకులగూడెం, జీలుగుమిల్లి గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఐదు ఎకరాలు లోపు రైతులందరికి 90 శాతం రాయితీతో బిందు సేద్యం పథకం ప్రభుత్వం అమలు చేస్తుందని, జీడిమామిడి రైతులు ఎకరానికి రూ.1500 చెల్లిస్తే బీమా వర్తిస్తుందని ఏవో కె.గంగాధరం తెలిపారు. అగ్రికల్చర్ అసిస్టెంట్ లావణ్య ఉన్నారు.

చేతి వృత్తిదారులను ఆదుకోవాలి

ఏలూరు రూరల్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): చేతి వృత్తిదారులకు జనాభా ప్రాతిపదికన విధులు కేటాయించి ఆదుకోవాలని, నిత్యావసర సరుకుల ధరలు తగ్గించాలని, పెంచిన విద్యుత్ చార్జీలు రూ.17 వేల కోట్లు భారాన్ని ఉపసంహరించుకోవాలని ఆంధ్రప్రదేశ్ చేతివృత్తిదారుల సమన్వయ కమిటీ జిల్లా కన్వీనర్ ఆదిశేషు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. జిల్లా కార్యాలయంలో గొర్రెలు, మేకల పెంపకందారుల సంఘం నాయకులు యు.గోపాలకృష్ణ అధ్యక్షతన మంగళవారం సమావేశం జరిగింది. ఆదిశేషు మాట్లాడుతూ ఈ నెల 14 వరకు జరుగుతున్న పోరాటాల్లో ఏలూరు జిల్లా ప్రజలు పెద్దసంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని విజ్ఞప్తి చేశారు. ఎం.రాజు పాల్గొన్నారు.

రెడ్డిఅప్పలనాయుడుకు అభినందనలు

ఏలూరు రూరల్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ విజయవాడ రీజనల్ బోర్డు జోన్ చైర్మన్‌గా నియమించిన జనసేన పార్టీ ఏలూరు నియోజకవర్గ ఇన్‌చార్జి రెడ్డిఅప్పలనాయుడిని మంగళవారం ఆ పార్టీ కార్యాలయంలో జడ్పీ చైర్మన్ ఘంటా పద్మశ్రీ మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించి అభినందనలు తెలిపారు. తొలుత జనసేన నాయకులు, కార్యకర్తలు బాణసంచా కాల్చి తమ భిమానాన్ని చాటుకున్నారు.



రెడ్డిఅప్పలనాయుడును అభినందిస్తున్న జడ్పీ చైర్మన్ ఘంటా పద్మశ్రీ

క్రమశిక్షణతో విద్యను అభ్యసించాలి

ఏలూరు క్రైం, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థులు క్రమ శిక్షణతో విద్యను అభ్యసించాలని, అల్లరి చిల్లరిగా ఉంటే భవిష్యత్తులో ఎన్నో ఇబ్బందులకు గురి కావాల్సి ఉంటుందని, కష్టపడి చదివితే బంగారు భవిష్యత్తు ఉంటుందని ఏలూరు మహిళా పోలీస్ స్టేషన్ సీఐ ఎం.సుబ్బారావు, ఎస్ఐ వి.కాంతిప్రియ సూచించారు. అభయ మహిళా రక్షక దళంపై ఏలూరు కొత్త బస్టాండ్‌లో ప్రయాణికులకు అవగాహన కల్పించారు. చిన్నారులపై జరుగుతున్న లైంగిక దాడులు, ర్యాగింగ్, ఈవ్‌టీజింగ్, ఇతర నేరాల నుంచి రక్షణ కల్పించి సత్వర న్యాయం అందించడానికి ఏలూరు జిల్లా అభయ మహిళా రక్షక బృందం పని చేస్తుందని సీఐ, ఎస్ఐలు చెప్పారు. ఏలూరు నగరంలో విద్యా సంస్థల వద్ద, కళాశాలల వద్ద మహిళా పోలీస్ సిబ్బంది ప్రత్యేక వాహనాలతో సైరెన్లతో తిరుగుతూ మహిళలకు, విద్యార్థులకు ఆత్మస్థైర్యం కల్పించారు. పలు చోట్ల విద్యార్థులు ఉండడంతో వారికి కౌన్సిలింగ్ ఇచ్చారు. ఎక్కడైనా ఈవ్‌టీజింగ్ జరిగినా ఏ నేరం జరిగినా తక్షణం వాట్స్‌ప్ నెంబర్ 95503 501100కు సమాచారం అందించాలని సీఐ సుబ్బారావు, ఎస్ఐ కాంతిప్రియ సూచించారు.



విద్యార్థులకు కౌన్సిలింగ్ ఇస్తున్న ఎస్ఐ కాంతిప్రియ

సోషల్ మీడియా అనర్థాలపై అవగాహన

ఏలూరు అర్బన్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి) : సోషల్ మీడియా అనర్థాలపై మంగళవారం స్థానిక శర్వాణి స్కూల్లో టూ టౌన్ పోలీసులు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. సోషల్ మీడియాలో అపరిచిత వ్యక్తులతో పరిచయం, ప్రొఫైల్ పిక్, చాటింగ్ వల్ల ఇబ్బందులను మహిళా ఎస్సై నాగకళ్యాణి వివరించారు. ఆపదలోవు న్నపుడు టోల్ ఫ్రీ నెంబరు 112కు సమాచారం ఇవ్వాలని కోరారు. హెచ్ఎం సత్యశారద పాల్గొన్నారు.

ఎల్ఐసీ ఏజెంట్‌ల జిల్లా అధ్యక్షుడిగా త్రివేణికుమార్



ఏలూరు, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి) : ఎల్ఐసీ ఏజెంట్స్ యూనియన్ అధ్యక్షుడిగా వడ్డి త్రివేణికుమార్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఏలూరులో జరిగిన ఎల్ఐసీ ఏజెంట్ల సర్వసభ్య సమావేశంలో నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా హనుమాన్ జంక్షన్‌కు చెందిన త్రివేణికుమార్, ప్రధాన కార్యదర్శిగా శ్రీనివాసరావు, కోశాధికారిగా ఎం.వెంకట నరసింహరాజు, ఉపాధ్యక్షులుగా కొండేటి రాంబాబు, ఎం.శివప్రసాద్, వి.శివభాస్కర్, సంయుక్త కార్యదర్శిగా ఎం.సత్యనారాయణ, జీవీఎస్ సతీష్‌బాబు, ఎస్.భీమరాజు, ఆర్గనైజింగ్ సెక్రటరీగా పుచ్చల బాబూరావు, ఎ.సత్యనారాయణ ఎన్నికయ్యారు.

ఆర్థిక అక్షరాస్యతపై శిక్షణ

భీమడోలు, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి) : మహిళలకు డిజిటల్ ఆర్థిక క్రియాత్మక అక్షరాస్యతపై ఆరు నెలల పాటు శిక్షణ ఇస్తామని ఎంపీడీవో పద్మావతి తెలిపారు. భీమడోలు వెలుగు కార్యాలయంలో వెలుగు ఏపీఎం కె.రత్నకుమారి అధ్యక్షతన మంగళవారం అక్షరాస్యత శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన వయోజన విద్యా జిల్లా అసిస్టెంట్ ప్రాజెక్టు డైరెక్టర్ సత్యనారాయణ మాట్లాడుతూ మండలానికి 270 నిరక్షరాస్య మహిళలను గుర్తించామని 10 మందికి ఒకరు చొప్పున బోధన వలంటీర్లుగా నియమించామన్నారు. గ్రామాల్లో అంగన్‌వాడీ కేంద్రాలు, పాఠశాలలు వద్ద ప్రాథమిక విద్యను బోధిస్తామన్నారు. అక్షర మార్గదర్శినిని ఆవిష్కరించారు. ఎమ్మార్పీ బాబూరావు, తదితరులు పాల్గొన్నారు.

'చేయూత' సాయం



ఆర్థిక సాయం అందిస్తున్న సభ్యులు

పెదవేగి, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి) : గ్రామానికి చెందిన బొలుసు నానిబాబు కొబ్బరి కాయలు దింపుడు కార్మికునిగా పనిచేస్తున్నాడు. కొద్ది నెలల కిందట కొబ్బరి చెట్టు నుంచి కాయలు దింపుతూ ప్రమాదవశాత్తు చెట్టుపై నుంచి పడి, తీవ్రంగా గాయపడ్డాడు. చికిత్స తీసుకున్నప్పటికీ వెన్నెముక గాయంతో మంచానికే పరిమితమయ్యాడు. పేద కుటుంబం కావడంతో తినడానికే ఇబ్బందులు పడుతున్న ఆ కుటుంబం ఇప్పుడు నానిబాబు వైద్య ఖర్చులు భరించలేని దుస్థితిలో అవస్థలు పడుతున్నారు. ఆ కుటుంబం దీనస్థితిని గమనించిన పెదవేగికి చెందిన చేయూత స్వచ్ఛంద సంస్థ సభ్యులు నెల నెల ఒక కుటుంబానికి అందించే సాయం నానిబాబు కుటుంబానికి అందించారు. నానిబాబు భార్య నాగజ్యోతికి రూ.12 వేలు నగదుతోపాటు 26 కిలోల బియ్యం, ఐదు కిలోల వంటనూనె, నిత్యావసరాలను సాయంగా అందించారు. చేయూత సభ్యులు లక్ష్మీనారాయణ, శ్రీనివాసరావు, నాగార్జున, లక్ష్మణరావు, రాజేంద్ర, చిన్నా, మధు, దుర్గాప్రసాద్ పాల్గొన్నారు.

విద్యార్థులకు వైద్య పరీక్షలు

ఏలూరు క్రైం, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి) : బాలల ఆరోగ్య పరిస్థితులను ఎప్పటికప్పుడు తెలుసుకుని తగిన వైద్యం అందించాలని జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి సీనియర్ సివిల్ జడ్జి కె.రత్న ప్రసాద్ అన్నారు. ఏలూరు సమీపంలోని దొండపాడులో ఉన్న పరివర్తన విభిన్న ప్రతిభావంతుల పాఠశాలలో మెడికల్



క్యాంపును మంగళవారం నిర్వహించారు. హోమ్ ప్రిన్సిపాల్ శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.

ఎస్సీ జాబితాలో చేర్చండి

ఏలూరు రూరల్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో రజకులను ఎస్సీజాబితాలో చేర్చే అంశాన్ని పరిశీలించాలని రాజమండ్రి ఎంపీ దగ్గుపాటి పురందరేశ్వరికి వినతిపత్రం అందచేశారు. రజక కార్పొరేషన్ చైర్మన్‌గా సి.సావిత్రికి అవకాశం కల్పించినందుకు కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ రాష్ట్ర కార్యాలయంలో పురంధరేశ్వరితో పాటు టీటీడీ పాలక మండలి సభ్యులుగా నియమితులైన భానుప్రకాష్‌రెడ్డికి శాలువాకప్పి



రాజమండ్రి ఎంపీ పురంధరేశ్వరికి వినతిపత్రం అందచేస్తున్న నాయకులు

సత్కరించారు పోసిబాబు, తదితరులు తెలిపారు.

మూర్తి రాజు వర్ధంతి

నిడమర్రు నవంబర్ 12 (ఆంధ్రజ్యోతి): గాంధేయవాది మాజీ విద్యా శాఖా మంత్రి చింతలపాటి వరప్రసాదరాజు సేవలను ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలని జిల్లా సర్వోదయ మండలి ప్రధాన కార్యదర్శి ఇ.ప్రసాదరాజు అన్నారు. పెదనింద్రకొలను గాంధీభవన్‌లో మంగళవారం మూర్తిరాజు వర్థంతి నిర్వహించారు. ముందుగా మూర్తిరాజు, గాంధీ విగ్రహలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. విద్యార్థులకు నిర్వహించిన వివిధ పోటీలలో విజేతలకు బహుమతులు అందజేశారు.



విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న నాయకులు

పత్తేపురం ఉప సర్పంచ్ ఆర్. వెంకటేశ్వర రాజు(కొండయ్య), పి.లక్ష్మీపతిరాజు, ఇ.సత్యనారాయణ, ఎస్.అచ్యుతరామారావు, ఎ.రఘు, జానకి రామారాజు సర్వోదయ మండలి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించండి

ఏలూరు రూరల్, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): జలవనరుల శాఖలో పనిచేస్తున్న వివిధ శాఖల ఉద్యోగులకు సంబంధించిన సమస్యలు పరిష్కరించాలని కోరుతూ మంగళవారం ఇరిగేషన్ శాఖ ఎన్జీవోస్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు చోడగిరి శ్రీనివాస్ ఆధ్వర్యంలో విజయవాడలో ఆ శాఖ ఇంజినీర్ చీఫ్ రత్నకుమార్‌ను కలిసి వినతిపత్రం అందచేశారు. ఏపీఎంఎస్ నుంచి ఏపీఈఎస్ఎస్‌కు మారడానికి కావాల్సిన అవసరమైన అర్హతల కోసం ఇచ్చిన జీవో 64కు అమెండ్‌మెంట్, ఉద్యోగి జాయిన్ అయిన తరువాత ఏఈ, ఏఈఈ కోసం సాధించుకున్న అర్హతలను పరిగణలోకి తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. సూపరింటెండెంట్‌లకు ఎస్‌టీపీఏ పదోన్నతి కోసం సీనియార్టీ లిస్టును సిద్ధం చేయాలని కోరారు. వివిధ యూనిట్‌లలో పనిచేస్తున్న జూనియర్ అసిస్టెంట్‌ను హెచ్‌వోడీ లోకి విలీనం చేసినందుకు అభినందనలు తెలిపారు. రాష్ట్ర నాయకులు పాల్గొన్నారు.

దళితులకు అన్యాయం జరిగింది

బుట్టాయగూడెం, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ప్రభుత్వ బడ్జెట్‌లో దళితులకు తీరని అన్యాయం జరిగిందని కేవీపీఎస్ జిల్లా కార్యదర్శి ఎ.ఫ్రాన్సిస్ వాపోయారు. రాష్ట్రంలో దళితులు 17 శాతం ఉండగా ఆ మేరకు దామాషా గా బడ్జెట్‌లో నిధులు కేటాయించకపోవడం దుర్మార్గమని మండిపడ్డారు. 2024-25కు ఎస్సీ కాంపోనెంట్ బడ్జెట్ రూ.18,497.68 కోట్లు కేటాయించినట్లు చెప్పినా గత బడ్జెట్ అంచనాతో పోలిస్తే రూ.1507.54 కోట్లు తగ్గించారన్నారు. సాంఘీక సంక్షేమ శాఖకు రూ.244.62 కోట్లు, బుక్ బ్యాంక్‌కు రూ.1.6 కోట్లు, మహిళా శిశు సంక్షేమ శాఖకు రూ.122 కోట్లు, తగ్గించినట్లు తెలిపారు. చంద్రన్న పెళ్ళి కానుకకు నిధులు లేవన్నారు. ఎస్సీ, ఎస్టీ అత్యాచార నిరోధక రక్షణ చట్టానికి కేంద్రం ఇచ్చే నిధులు సర్దుబాటు చేశారు తప్పా రాష్ట్రం పైసా కూడా ఇవ్వలేదన్నా రు. ఎస్సీ కార్పొరేషన్‌లో రుణాలు, భూమి కొను గోలు పథకంతోపాటు గత ప్రభుత్వం అమలు చేయని 29 సంక్షేమ పథకాలకు నిధుల కేటాయింపు లేదన్నారు.

పరిమితి మించి పండించవద్దు

కొయ్యలగూడెం, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): పరిమితి మించి పొగాకు పండించవద్దని, బోర్డు అధికారుల సూచనల మేరకే పొగాకు పండించాలని పొగాకు బోర్డు రీజనల్ మేనేజర్ ప్రసాద్ పీఎల్‌కే ప్రసాద్ రైతులకు సూచించారు. స్థానిక పొగాకు బోర్డు ఆవరణలో మంగళవారం రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. బాడవ నేలల్లో కూడా పొగాకు పండించవద్దన్నారు.

క్రైమ్ కార్నర్

వృద్ధుడి అదృశ్యంపై ఫిర్యాదు

ఏలూరు క్రైం, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి) : ఏలూరు ప్రభుత్వాస్పత్రిలో చికిత్స పొందుతున్న ఒక వృద్ధుడు అదృశ్యమయ్యాడంటూ టూ టౌన్ పోలీసులక ఫిర్యాదు అందడంతో కేసు నమోదు చేశారు. కామవరపుకోట ఆడమిల్లికి చెందిన పసుపులేటి దావీదును ఈ ఏడాది అక్టోబర్ 12న ఏలూరు ప్రభుత్వాస్పత్రిలో చేర్పించారు. 19న అతడు ఆస్పత్రి నుంచి అదృశ్యమయ్యాడు. అప్పటి నుంచి అతని కోసం వారి కుటుంబ సభ్యులు గాలించినా ఆచూకీ లేకపోవడంతో అతని కుమారుడు పసుపులేటి రాజు మంగళవారం ఏలూరు టూ టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. టూ టౌన్ సీఐ వైవీ రమణ ఆధ్వర్యంలో పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రేషన్ షాపు తనిఖీ

ఏలూరు క్రైం, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి) : జిల్లా రీజినల్ విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారి (విజిలెన్సు ఎస్పీ) వి.శ్రీరామ్‌బాబుకు అందిన సమాచారంతో ఆయన ఆదేశాల మేరకు విజిలెన్సు తహసీల్దార్ కన్యాకుమారి, భీమడోలు సీఎస్‌డీటీ భరత్‌కుమార్, పౌరసరఫరాల అధికారులు ఎండీ వాహనాలను తనిఖీ చేపట్టారు. భీమడోలు మండలం పోలసానపల్లి గ్రామంలో ఉన్న రేషన్ షాపులో తనిఖీలు నిర్వహించగా బియ్యం, పంచాదార నిల్వల్లో వ్యత్యాసం ఉండడాన్ని గుర్తించారు. ఎండీయూ వాహనాన్ని కూడా తనిఖీ చేయగా అందులో కూడా పంచదార నిల్వలు వ్యత్యాసం ఉన్నాయి. దీంతో ఆ షాపు డీలర్, ఎండీయూ వాహనం ఆపరేటర్‌పై కేసు నమోదు చేశామని విజిలెన్సు అధికారులు వెల్లడించారు.

ద్విచక్ర వాహనం చోరీ

లింగపాలెం, నవంబరు12 (ఆంధ్రజ్యోతి): ఇంటి ముందు పెట్టిన ద్విచక్ర వాహనం కనిపించడం లేదంటూ ఓ వ్యక్తి ఫిర్యాదు చేసినట్లు ఎస్ఐ కె.వెంకన్న తెలిపారు. కలరాయుని గూడెం గ్రామానికి చెందిన యర్రా సాయిబాబు అనే వ్యక్తి గత ఆగస్టులో తన ఇంటిముందు పెట్టిన ద్విచక్ర వాహనం కనిపించడం లేదని పలుచోట్ల వెతికినా దొరకకపోవడంతో ఫిర్యాదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు. కేసు నమోదు చేసి .దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

ఆస్పత్రిలో అగ్నిప్రమాదం

కొయ్యలగూడెం, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఆరోగ్య ఆస్పత్రిలో మంగళవారం అగ్నిప్రమాదం జరిగింది. ఆస్పత్రి పై అంతస్థులో ఉన్న ఫైల్స్ భద్రపరిచిన రూంలో విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కావడంతో మంటలు చెలరేగాయి. దీంతో ఒక్కసారిగా పొగలు రావడంతో ఆస్పత్రి సిబ్బంది మంటలార్పారు. ఈ మంటల్లో రికార్డులన్నీ కాలిబూడిదయ్యాయి. ఆస్పత్రిలో ఉన్న రోగులకు ఎటువంటి ఇబ్బంది కలగకుండా బయటపడ్డారు. కరెంటు షార్ట్‌సర్క్యూట్ వలన ఈ ప్రమాదం జరిగినట్లు ఆస్పత్రి వర్గాలు తెలిపారు.

సారా బట్టీలపై దాడులు

జంగారెడ్డిగూడెం, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): కొంగువారిగూడెంలో సారా బట్టీలపై జంగారెడ్డిగూడెం ఎక్సైజ్ పోలీసులు మంగళవారం దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో 400 లీటర్ల బెల్లపు ఊటను ధ్వంసం చేసినట్లు సీఐ కె.శ్రీనుబాబు తెలిపారు. అలాగే కుక్కునూరు మండలం మారేడుబాకలో పది లీటర్ల సారాతో మహిళను అరెస్టు చేసి, 300 లీటర్ల బెల్లపు ఊటను ధ్వంసం చేశామన్నారు. పోలవరం మండలం వింజరంలో ఐదు లీటర్ల సారాతో మరో వ్యక్తిని అరెస్టు చేసిన ట్లు తెలిపారు. ఈ దాడుల్లో జంగారెడ్డిగూడెం ఎస్సైలు జి.వెంకటలక్ష్మి, సుబ్రహ్మణ్యం, ఆరీఫ్ పాల్గొన్నారు.

ఒకనిపై హత్యాయత్నం.. ఇద్దరిపై కేసు నమోదు

ఏలూరు క్రైం, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి) : పాతకక్షలు నేపధ్యంలో ఒక వ్యక్తిని చాకుతో పొడిచి హత్యాయత్నానికి పాల్పడిన సంఘటనపై ఏలూరు రూరల్ పోలీసులు కేసు నమోదు చేశారు. ఏలూరు రూరల్ మండలం లింగారావుగూడానికి చెందిన నూలు రంగారావు (42) అదే గ్రామానికి చెందిన బొడ్డు వెంకట్ (18) దసరా ఉత్సవాలు సందర్భంగా అమ్మవారి జాతరలో గొడవ తలెత్తింది. పాతకక్షలు నేపధ్యంలో బొడ్డు వెంకట్ అతనితో పాటు మరో యువకుడు కలిసి ఈనెల 11వ తేదీ రాత్రి ఆ గ్రామ సెంటర్‌లో కూర్చుని నూలు రంగారావుతో గొడవ పెట్టుకున్న బొడ్డు వెంకట్ మరో యువకుడు కలిసి చాకుతో పొడిచారు. తీవ్ర గాయాలపాలైన అతనిని ఏలూరు ప్రభుత్వాసుపత్రికి అతని పరిస్థితి ప్రమాదకరంగా ఉండడంతో ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. ఈసంఘటనపై ఏలూరు రూరల్ ఎస్ఐ సిహెచ్ దుర్గా ప్రసాద్ కేసు నమోదు చేశారు. వెంకట్, మరో యువకునిపై హత్యాయత్న కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

బంగారం.. మతలబు!

- దోచిన, నకిలీ బంగారం వ్యాపారుల వద్ద తాకట్టు పెడుతున్న దొంగలు
- పోలీసు కేసుల్లో ఇరుక్కుంటున్న వ్యాపారులు

భీమవరం క్రైం, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): అతివల అందానికి వస్త్రాలతో పాటు బంగారు ఆభరణాలు కూడా ఒక ప్రధాన పాత్ర పోషిస్తాయి. ప్రతి మహిళ బంగారానికి ఎంతో ప్రాధాన్యం ఇస్తుంటారు. వేడుకల్లో ఎవరు ఎక్కువ బంగారు ఆభరణాలు ధరిస్తే వారు ఉన్నతమైన స్థితిలో ఉన్నట్లు నిర్ధారిస్తారు. కానీ ఇటీవల బంగారం ధర రోజురోజుకు పెరుగుతూ రావడంతో దాన్ని ధరించడం కంటే చోరీలు జరుగుతాయేమో అన్న భయం అందరిలోనూ నెలకొన్నది. ఇటీవల జిల్లాలో బంగారం దొంగతనం కేసులు పెరిగాయి. దీంతో బంగారం కొనాలంటేనే చాలా మంది భయపడుతున్నారు. బంగారాన్ని ధరించి వేడుకలకు వెళ్లాలంటే ఆందోళన చెందే పరిస్థితి నెలకొన్నది. మరో పక్క ఇళ్లలో భద్రపరిచినా కూడా ఏం జరుగుతుందో అన్న ఆవేదన అందరిలోను మెదులుతున్నది. ఇదంతా ఒక ఎత్తు అయితే ముఖ్యంగా బంగారు వ్యాపారులు కూడా ఎప్పుడు ఏం జరుగుతుందో అన్న ఆందోళనలో ఉంటున్నారు. జిల్లాలో నర్సాపురం, భీమవరం, తాడేపల్లిగూడెం, తణుకు, పాలకొల్లు వంటి పట్టణాల్లో సుమారు 800 వరకు బంగారు దుకాణాలు ఉన్నాయి. అయితే కొంత మంది మర్యాదస్తులుగా వచ్చి బంగారు ఆభరణాలు విక్రయించడం, మరి కొందరు ఖాతాదారులు వెంటపెట్టుకుని వచ్చి బంగారం విక్రయించడంతో వ్యాపారస్తులు వాటిని కొనుగోలు చేస్తున్నారు. తరువాత వారు పోలీసులకు పట్టుబడితే పోసుల విచారణలో ఏ దుకాణాల్లో విక్రయించారో చూపించమనడంతో కొనుగోలు చేసిన వ్యాపారులు ఒకటికి మూడింతలు రికవరీ రూపేణా బంగారు వస్తువులు తిరిగి ఇవ్వవలసిన పరిస్థితి నెలకొంటుంది. మరో పక్క బాగా నమ్మిన ఖాతాదారులు కూడా నకిలీ బంగారు వస్తువులు తీసుకువచ్చి తాకట్టు పెడుతూ ఉండటంతో చివరకు వ్యాపారులు భారీగా నష్టపోతున్నారు. ఒక పక్క రికవరీల రూపంలో చెల్లింపులు మరో పక్క నకిలీ బంగారు వస్తువులు తాకట్టులతో తలలు పట్టుకునే పరిస్థితి ఏర్పడుతున్నది.

తాకట్టుకు ఆఫర్లు

ఇటీవల కొన్ని ప్రైవేటు తాకట్టు కంపెనీలు పుట్టగొడుగుల్లా వ్యాపించాయి. మా వద్ద బంగారం తాకట్టు పెట్టండి ఒక గ్రాముకు అధికంగా డబ్బు వడ్డీలకు ఇస్తామంటూ ప్రచారాలు, మరికొన్ని కంపెనీలు మీరు ఎక్కడైనా బంగారు వస్తువులు తాకట్టు పెడితే అవి విడిపించి మేమే కొనుగోలు చేస్తాం అంటూ ప్రచారాలు చెయ్యడంతో కొందరు దొంగలకు ఇదో అవకాశంగా మారుతున్నది. కొట్టేసిన బంగారు ఆభరణాలను కొన్ని ప్రైవేటు కంపెనీల్లో తాకట్టుపెట్టి కొన్నాళ్ళకు అవి విడిపించి కొనేవారికి విక్రయాలు చేసి సొమ్ము చేసుకుంటున్నారు.

వ్యాపారులు జాగ్రత్తలు పాటించాలి

ఆర్‌జీ జయసూర్య (భీమవరం డీఎస్పీ)



బంగారు వ్యాపారులు కొత్తవారి పట్ల, అపరిచితుల పట్ల జాగ్రత్తలు పాటించాలి. ఏదో లాభం కోసం ఆశపడి చాలా వరకు నష్టపోతున్నారు. అలాగే తాకట్టు పెట్టుకునే వారి వద్ద కూడా ఆధార్‌కార్డు, అడ్రస్ వివరాలు తీసుకుని తాకట్టు పెట్టుకోవాలి. ఇలా చాలా మంది మోసపోతున్నారు. బంగారం ధరలు భారీగా పెరిగిపోవడంతో దొంగతనాలు పెరిగాయి. దొంగలు ఇటీవల తెలివితేటలు ఉపయోగించి దొంగిలించిన బంగారాన్ని తాకట్టు పెడుతున్నారు. అది కూడా ప్రైవేటు కంపెనీల్లో ఎక్కువ పెడుతున్నారు. తరువాత వాటినే మరో ప్రైవేటు కంపెనీలకు విక్రయిస్తున్నారు. అలాంటి కేసులు భారీగా పెరిగాయి. దీనిపై వ్యాపారులకు అవగాహన కల్పిస్తాం.

● మోసాలు జరిగే తీరు ఇలా..

- నరసాపురం పట్టణంలో ఒక వ్యాపారికి ఒక మహిళ దఫదఫాలుగా బంగారం తాకట్టు పెట్టి సుమారు రూ.60 లక్షలు వరకు తీసుకున్నది. మళ్ళీ ఆ మహిళ బంగారు వస్తువులు తీసుకురాగా ఆ వ్యాపారి స్నేహితుడు పరిశీలించి బంగారు వస్తువులు కాదని చెప్పడంతో ముందుగా పెట్టిన వస్తువులు కూడా పరిశీలించగా అవి కూడా నకిలీ వస్తువులుగా తేలింది.
- భీమవరం పట్టణంలో ఒక వ్యాపారి రెండు సంవత్సరాలు క్రితం ఒక మహిళకు చెందిన సుమారు 8 కాసుల బంగారు వస్తువులు తాకట్టు పెట్టుకున్నాడు. ఈ మహిళ రెండు సంవత్సరాలైనా విడిపించకపోవడం, వడ్డీ కూడా చెల్లించకపోవడంతో ఆవ్యాపారి వస్తువులను తనిఖీ చెయ్యగా నకిలీవని తేలింది. దీంతో మహిళకు ఫోన్ చెయ్యగా ఫోన్‌కు స్పందించ లేదు. ఆ మహిళ అడ్రెస్ కూడా దొరకలేదు.
- తాడేపల్లిగూడెంకు చెందిన ఒక వ్యాపారి బాగా తెలుసున్న ఖాతాదారుని స్నేహితుని వద్ద సుమారు 2 కాసులు బంగారు వస్తువులు కొనుగోలు చేశాడు. అయితే కొద్ది రోజులు తరువాత ఆ వ్యక్తిని తీసుకుని పోలీసులు వచ్చారు. 8కాసులు అమ్మినట్లు చెప్పాడని రికవరీ చేసుకొని వెళ్ళారు. దీంతో ఆ వ్యాపారి ఖంగుతిన్నాడు.
- ఇటీవల ఆకివీడు పట్టణానికి చెందిన ఇద్దరు వ్యక్తులు 400 గ్రాముల బంగారాన్ని దొంగిలించి ఆ బంగారాన్ని ఒక ప్రముఖ కంపెనీలో తాకట్టు పెట్టారు. కొద్ది రోజులు తరువాత ఆ బంగారాన్ని విడిపించి ఒక ప్రముఖ కంపెనీలోని అసిస్టెంట్ మేనేజర్‌కు విక్రయించి సొమ్ము చేసుకున్నారు. ఆ ఇద్దరు దొంగలతో పాటు కంపెనీ అసిస్టెంట్ మేనేజర్ కూడా పోలీసులు అరెస్టు చేశారు.
- పాలకోడేరు మండలానికి చెందిన ఒక ప్రముఖ పార్టీ నేత ఇంట్లో పనిమనిషిగా చేస్తున్న ఒక మహిళ కొద్ది రోజుల క్రితం బంగారు ఆభరణాలు చోరీ చేసి భీమవరం పట్టణంలో ఒక వ్యాపారి వద్ద తాకట్టు పెట్టింది. ఆ మహిళ పోలీసులు విచారణలో పట్టుబడటంతో ఆ వ్యాపారి ఆభరణాలు తిరిగి ఇచ్చేసి చేతులు కాల్చుకునే పరిస్థితి ఏర్పడింది.

డిప్యూటీ స్పీకర్‌గా ఆర్‌ఆర్‌ఆర్

విప్‌లుగా బొలిశెట్టి, బొమ్మిడి





(భీమవరం-ఆంధ్రజ్యోతి)

తెలుగుదేశం ఉండి ఎమ్మెల్యే రఘురామ కృష్ణరాజుకు డిప్యూటీ స్పీకర్ పదవి వరించనుంది. కూటమి ప్రభుత్వం ఆ దిశగా కీలక నిర్ణయం తీసుకుంది. అసెంబ్లీలో ఎన్నికద్వారా డిప్యూటీ స్పీకర్ పదవిని నియమిస్తారు. అసెంబ్లీ డిప్యూటీ స్పీకర్‌గా రఘురామరాజు నియామకం లాంచనప్రాయం కానుంది, వైసీపీ ప్రభుత్వంలో ప్రజాగళం వినిపించి రఘురామరాజు రెబల్ ఎంపిగా మిగిలారు. ఎన్నికల ముందు టీడీపీకి చేరువయ్యారు. ఉండి ఎమ్మెల్యే అభ్యర్థిగా నిలబడి విజయం సాధించారు. తొలుత రఘురామ రాజుకు స్పీకర్ పదవి వస్తుందన్న చర్చ సాగింది. అయ్యన్నపాత్రునికి స్పీకర్ పదవి దక్కింది.

మరోవైపు జిల్లాకు చెందిన ఇద్దరు ఎమ్మెల్యేలను విప్‌లుగా నియమించింది. తాడేపల్లిగూడెం జనసేన ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్, నర్సాపురం జనసేన ఎమ్మెల్యే బొమ్మిడి నాయకర్‌లను నియమిస్తూ ఆదేశాలు జారీ చేసింది. శాసనసభలో చీఫ్ విప్‌తో సహ మరో 15 మంది ఎమ్మెల్యేలను ప్రభుత్వం విప్‌లుగా ప్రకటించారు. అందులో 12 మంది టీడీపీ, ముగ్గురు జనసేన, ఒక బీజేపీ ఎమ్మెల్యేలుగా ఉన్నారు. జనసేనలో ముగ్గురు ఎమ్మెల్యేలలో జిల్లాకు చెందిన ఇద్దరికి ప్రభుత్వం విప్‌లుగా నియమించింది. ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ సూచనలు మేరకే జిల్లాలో జనసేన ఎమ్మెల్యేలకు విప్‌ల కేటగిరిలో ప్రాధాన్యత ఇచ్చారు. బొలిశెట్టి, బొమ్మిడి తొలిసారి ఎమ్మెల్యేలుగా ఎన్నికై అసెంబ్లీలో అడుగు పెట్టారు.

కార్పొరేషన్‌లకు డైరెక్టర్ల నియామకం

నాలుగు పదవులు దక్కించుకున్న ఏలూరు, పశ్చిమ నాయకులు

కళింగ కార్పొరేషన్ డైరెక్టర్‌గా సీతారామాంజనేయులు

ఆకివీడు రూరల్ నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): పెదకాపవరం టీడీపీ నాయకుడు లంబాడి సీతారామాంజనేయులును రాష్ట్ర కళింగ కార్పొరేషన్ డైరెక్టర్‌గా నియమిస్తూ సీఎం చంద్రబాబు ఆదేశాలు జారీ చేశారు. 1999 నుంచి టీడీపీకి అంకితభావంతో పనిచేస్తున్నారు. ప్రస్తుతం యూనిట్ ఇన్‌ఛార్జిగా ఉన్నారు.

రాష్ట్ర శెట్టి బలిజ కార్పొరేషన్ డైరెక్టర్‌గా చిట్టిబోయిన

జంగారెడ్డిగూడెం, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): జంగారెడ్డిగూడెం పట్టణానికి చెందిన టీడీపీ రాష్ట్ర బీసీ సెల్ కార్యదర్శి చిట్టిబోయిన రామలింగే శ్వరరావు రాష్ట్ర శెట్టి బలిజ కార్పొరేషన్ డైరెక్టర్‌గా నియమితులయ్యారు. ఈ సందర్భంగా పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి దాసరి శ్యామ్ చంద్రశేష తదితరులు శుభాకాంక్షలు తెలిపారు.

అగ్నికుల క్షత్రియ కార్పొరేషన్ డైరెక్టర్‌గా వాతాడి

నరసాపురం రూరల్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): అగ్నికుల క్షత్రియ కార్పొరేషన్ డైరెక్టర్‌గా వేములదీవి గ్రామానికి చెందిన వాతాడి ఉమాను నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఎమ్మెల్యే నాయకర్, ఇన్‌చార్జి పొత్తూరి రామరాజు, కొవ్వలి నాయుడు, జక్కం శ్రీమన్నారాయణ, గుబ్బల నాగరాజు, కొప్పాడ రవి తదితరులు అభినందనలు తెలిపారు.

ఆర్యవైశ్య కార్పొరేషన్ డైరెక్టర్‌గా మురళి

తాడేపల్లిగూడెం అర్బన్, నవంబరు 12 (నవంబరు): ఆర్యవైశ్య కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్‌గా పట్టణానికి చెందిన తెలుగుదేశం నాయకుడు పద్మనాభుని మురళి నియమితుల య్యారు. టీడీపీ నియోజ కవర్గ ఇన్‌చార్జి వలవల బాబ్జి, కూటమి నాయకులు మురళిని అభినందించారు.



సింగరాయపాలెంలోని సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయం

నిధులు కొండంత.. సిబ్బంది గోరంత

సుబ్రహ్మణ్యేశ్వర ఆలయంలో పోస్టులు భర్తీ ఎప్పుడో?

ముదినేపల్లి, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): దేవదాయ, ధర్మదాయ శాఖ కమిషనర్ కేడర్ ఆలయమైన ముదినేపల్లి మండలం సింగ రాయపాలెం - చేవూరుపాలెం సెంటర్‌లోని శ్రీ వల్లీదేవసేన సమేత శ్రీ సుబ్రహ్మణ్యేశ్వరస్వామి దేవస్థానంలో సిబ్బంది కొరత ఏర్పడింది. ఏళ్ల తరబడి ముఖ్యమైన పోస్టులు ఖాళీగానే ఉన్నాయి. అసిస్టెంట్ కమిషనర్ హోదా కలిగిన కార్యనిర్వహణాధికారి ఉన్న ఈ దేవస్థానం లో స్టాఫ్ పేట్రన్ ప్రకారం కార్యాలయంలో సూపరింటెండెంట్, సీని యర్ అసిస్టెంట్, జూనియర్ అసిస్టెంట్, రికార్డు అసిస్టెంట్, అటెండర్లు ఇద్దరు ఉండాలి. సూపరింటెండెంట్ పోస్టు నేటికీ మంజూరు కాలేదు. అధికారులు ఈ పోస్టు మంజూరుకు ప్రతిపా దనలు కూడా పంపలేదు. ఇక మంజూరైన సీనియర్, జూనియర్ అసిస్టెంట్ల పోస్టులు తరచూ ఖాళీగానే ఉంటున్నాయి. ఆ పోస్టుల్లో పని చేసే వారు చాలా కాలం క్రితం వేరే దేవస్థానాలకు బదిలీ కాగా సీనియర్, జూనియర్ అసిస్టెంట్ల పోస్టుల్లో ఎవరినీ నియ మించలేదు. బాధ్యత కలిగిన కార్యాలయ ఉద్యోగుల పోస్టులన్నీ ఖాళీగానే ఉన్నాయి. ప్రస్తుతం రికార్డు అసిస్టెంట్, అవుట్ సోర్సింగ్ ద్వారా నియమించిన కంప్యూటర్ ఆపరేటర్ మాత్రమే కార్యాలయ పనులు నిర్వహించాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఈ ఇద్దరు ఉద్యోగులే దేవస్థానం అసిస్టెంట్ కమిషనర్‌కు బాధ్యుల య్యారు. సీనియర్, జూనియర్ అసిస్టెంట్లు చేయాల్సిన పనులను రికార్డు అసిస్టెంట్, ఆపరేటర్ చేస్తున్నారు. దేవస్థానం కార్యకలాపాలు, రికార్డు పనులు ప్రతి రోజూ అప్‌డేట్ చేయటం వారికి కష్టమవుతున్నది. సిబ్బంది కొరత ఉన్న విషయం దేవదాయశాఖ ఉన్నతాధికారుల దృష్టిలో ఉన్నా చర్యలు లేవు. త్వరలో జరిగే షష్టి కల్యాణోత్సవాల ఏర్పా ట్లు, ఇతర పనుల నిర్వహణ సిబ్బంది కొరతతో ఎలా ముందుకు సాగుతాయన్నది ప్రశ్నార్థకం. అటెండర్ పోస్టు కూడా ఖాళీగా ఉంది.

పరిశీలిస్తా..

సుబ్రహ్మణ్యేశ్వరస్వామి దేవస్థానంలో ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేసే విషయాన్ని పరిశీలిస్తా. దీనిపై అధికారులతో మాట్లాడి చర్యలు తీసుకుంటా.

-సత్యనారాయణ, కమిషనర్, ఏపీ ఎండోమెంట్స్



ఆర్డీవోకు రైతు సంఘం వినతిపత్రం

కౌలు రైతు కుటుంబాన్ని ఆదుకోండి

నూజివీడు, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): ఆర్థిక బాధలతో ఆత్మహత్యకు పాల్పడిన కౌలు రైతు కుటుంబానికి పరిహారం చెల్లించి ఆ కుటుం బాన్ని ఆదుకోవాలని రాష్ట్ర రైతు సంఘం నాయ కులు నూజివీడు ఆర్డీవో ఎం.వాణికి వినతి పత్రాన్ని అందించారు. ముసునూరు మండలం గోగులంపాడుకు చెందిన కౌలు రైతు చెన్ను రాజారావు వ్యవసాయంలో నష్టాలతో అప్పు తీర్చే మార్గం లేక ఆత్మహత్య చేసుకున్న నేపథ్యంలో అతని కుటుంబాన్ని ఆదుకోవాలని రైతుసంఘం నాయకులు నిమ్మగడ్డ నరసింహ డిమాండ్ చేశారు.

9,255 మంది దరఖాస్తు..

గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఓట్ల నమోదుకు నియోజకవర్గవ్యాప్తంగా 9,255 అర్జీలు దాఖల అయ్యాయని, ఆర్డీవో ఎం.వాణి తెలిపారు. అత్యధికంగా నూజివీడు మండలం నుంచి 4,761, ఆగిరిపల్లిలో 1625, చాట్రాయిలో 1513, ముసునూరులో 1356 మంది గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఓటర్లుగా నమోదుకు అర్జీలు దాఖలు చేయగా, అధికారుల పరిశీలనలో ఉన్నాయన్నారు.

గ్రామాల్లో ఓటరు ముసాయిదా ప్రకటన

సాగునీటి సంఘాల ఎన్నికలకు సంబంధించి ఓటరు ముసాయిదా ప్రకటనను ఆయా గ్రామాల్లో చేపట్టడం జరిగిందని, అభ్యంతరాలు స్వీకరించిన అనంతరం ఓటర్ల వివరాలను వెల్లడించనున్నట్లు నూజివీడు ఆర్డీవో వాణి అన్నారు. నూజివీడు సబ్ కలెక్టర్ కార్యాలయంలో ఆమె విలేకర్లతో మాట్లాడుతూ నూజివీడు డివిజన్ పరిధిలో పెద్ద, చిన్నతరహా చెరువులు 19, మైనర్ ఇరిగేషన్ చెరువులు 106 ఉన్నాయన్నారు. ఇందుకు సంబంధించి పెద్ద, మధ్యస్త సాగునీటి చెరువులకు 12 ప్రాదేశిక నియోజకవర్గాలు ఉండగా, చిన్న తరహా వాటికి ఆరు ఉన్నాయన్నారు. వీటికి సంబంధించి ఎన్నికల అధికారులను నియ మించామని, 18 ఏళ్లకు పైబడి చెరువుల కింద భూములు ఉన్న రైతులను ఓటర్లుగా నమోదు చేయటం జరుగుతోందన్నారు. ఎన్నికల అధికా రులకు గురువారం ఎన్నికల నిర్వహణపై శిక్షణా కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఆమె తెలిపారు.

వ్యవసాయానికి మహర్దశ

చాట్రాయి, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్, వ్యవసాయ మంత్రి అచ్చెన్నాయుడు అసెంబ్లీలో ప్రవేశపెట్టిన బడ్జెట్ వల్ల వ్యవసాయ రంగానికి, రాష్ట్రానికి మహర్దశ రానున్నదని కూటమి నాయకులు హర్షం వ్యక్తం చేశారు. మంగళవారం వారు మాట్లాడుతూ అమరావతికి, పోలవరం తదితర సాగునీటి ప్రాజెక్టులకు, వైద్యం, విద్య, రోడ్లు, గృహ నిర్మాణం తదితర రంగాలకు భారీగా నిధులు కేటాయించటం శుభ పరిణామన్నారు. టీడీపీ మండల అధ్యక్షురాలు బొట్టు వరలక్ష్మి, పార్టీ నాయకులు మందపాటి బసవారెడ్డి, మోరంపూడి శ్రీనివాసరావు, బొట్టు లక్ష్మణరావు, కలకొండ భాస్కరరావు, బీజేపీ నాయకులు గడ్డం సంజీవరెడ్డి, ఓబిళ్ళనేని రాజా, జనసేన నాయకుడు తుమ్మల జగన్ తదితరులు బడ్జెట్‌పై హర్షం వ్యక్తం చేశారు.

నైతిక విలువలు పాటించాలి

ముసునూరు, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): నైతిక విలువలతో కూడిన విద్యతో ఉన్నతస్థాయికి చేరవచ్చునని మానవత ఛైర్మన్ కృష్ణప్రసాద్ అన్నారు. మంగళవారం ముసునూరు గురుకుల బాలికలకు సంస్థ ఆధ్వర్యంలో నైతిక విలువలు, భవిష్యత్ కార్యాచరణపై అవగాహన కల్పించారు. గత విద్యా సంవత్సరంలో క్లాస్‌లో ప్రథమస్థానం సాధించిన బాలికలకు మెమెంటోలు, సర్టిఫికెట్లను అందజేశారు. వైస్ ఛైర్మెన్ అనంతలక్ష్మీ, కె.రామారావు, ప్రిన్సిపాల్ కె.ప్రవీణ పాల్గొన్నారు.

ఉచిత ఫిజియోథెరపీని సద్వినియోగం చేసుకోండి

మాగంటి బాబుకు తెలుగుతమ్ముళ్ల పరామర్శ

ముదినేపల్లి, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకుడు, మాజీ ఎంపీ మాగంటి బాబును మంగళవారం ముదినేపల్లి టీడీపీ నాయకులు కలిశారు. ఆయన ఆరోగ్యం మెరుగుపడాలని సింగరాయపాలెం - చేవూరుపాలెం సెంటర్‌లోని సుబ్రహ్మణ్యస్వామికి తెలుగు రైతు రాష్ట్ర కార్యదర్శి చలసాని జగన్మోహన రావు, టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు కొత్తూరు విఠల్, శ్రీహరిపురం సర్పంచ్ పరసా విశ్వేశ్వరరావు పూజలు చేసి ఏలూరులో మాగంటిని కలసి ప్రసాదాన్ని అందజేశారు.

కాంట్రాక్ట్ కార్మికులను పర్మినెంట్ చేయాలి

నూజివీడు టౌన్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): మున్సిపల్ కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ కార్మికులను క్రమబద్ధీకరించాలని కోరుతూ ఏఐటీయూసీ అనుబంధ మున్సిపల్ కాంట్రాక్ట్ అవుట్‌సోర్సింగ్ కార్మికుల సంఘం ఆధ్వర్యంలో నూజివీడు మున్సిపాల్టీ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. ఏఐటీయూసీ నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి చాట్ల పుల్లారావు మాట్లాడుతూ మున్సిపల్ కార్మికులకు సమానపనికి సమాన వేతనం ఇవ్వాలని డిమాండ్ చేశారు. కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ కార్మికులు నాగేశ్వరరావు, ఉమాదేవి, శామ్యల, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ఉచిత ఫిజియో థెరపీ

ముసునూరు, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): దివ్యాంగులకు ప్రభుత్వం అందిస్తున్న ఉచిత ఫిజియోథెరపీ శిబిరాన్ని, ఉపకరణాలను సద్వినియోగం చేసుకోవాలని డాక్టర్ జి.ప్రశాంతి కోరారు. మంగళవారం రమణక్కపేట మెయిన్ పాఠశాలలోని భవిత సెంటర్‌లో దివ్యాంగ పిల్లలకు ఉచిత ఫిజియోతెరపీ నిర్వహించి వారి పట్ల తల్లిదండ్రులు తీసుకోవాల్సిన జాగ్రత్తలను డాక్టర్ ప్రశాంతి వివరించారు.

పేదల సంక్షేమానికి టీడీపీ కృషి

ముసునూరు, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): పేదల సంక్షేమానికి టీడీపీ కృషి చేస్తోందని నియోజకవర్గ తెలుగుయువత కార్యదర్శి కొండేటి ఉదయ్‌కిరణ్(బాబి), క్లస్టర్ ఇన్‌చార్జ్ గార్లపాటి నరసింహరావు అన్నారు. ముసునూరు రైస్‌మిల్లు సెంటర్‌లో టీడీపీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని నిర్వహించారు. సుమారు 200 మంది టీడీపీ సభ్యత్వాన్ని తీసుకున్నారు. నియోజకవర్గ బీసీ సెల్ ఆర్గనైజింగ్ కార్యదర్శి నక్కా యోహాను, వార్డు సభ్యుడు రెడ్డి కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

స్మార్ట్ ఇండియా హ్యాకథాన్‌కు ట్రిపుల్ ఐటీ విద్యార్థులు



నూజివీడు టౌన్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): స్మార్ట్ ఇండియా హ్యాక థాన్ 2024కు రాజీవ్‌గాంధీ యూని వర్సిటీ ఆఫ్ నాలెడ్జ్ అండ్ టెక్నాలజీ నూజివీడు క్యాంపస్ నుంచి రెండు బృందాలు ఎంపికైనట్లు నూజివీడు ట్రిపుల్ ఐటీ డైరెక్టర్ ఎస్.అమరేంద్ర కుమార్ తెలిపారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ విద్యార్థుల్లో సాంకేతిక సృజనాత్మక నైపుణ్యాలను ప్రదర్శించటం ద్వారా వాస్తవ, ప్రపంచ సవాళ్ళను పరిష్కరించ టానికి తీసుకోవాల్సిన చర్యలపై ఈ హ్యాక్‌థాన్ ద్వారా అవకాశం కలుగుతుందన్నారు. డిసెంబర్ 11న నిర్వహించనున్న హ్యాక్‌థాన్ ఫైనల్ పోటీకి ట్రిపుల్ ఐటీ నుంచి పి.వెంకటేష్ నేతృత్వంలో బృందం ఛత్తీస్‌గడ్‌లోని బిలాయిలో పోటీలకు హాజరవుతుందన్నారు. అలాగే ఎం.చంద్ర సిద్ధార్థ బృందం డిసెంబర్ 11న మైసూరు ఈవెంట్‌లో పోటీ పడుతుందని తెలిపారు. ఎంపికైన విద్యార్థులను ట్రిపుల్‌ఐటీ ఏవో బి.లక్ష్మణ్, ఫైనాన్స్ ఆఫీసర్ నాగార్జునాదేవి తదితరులు అభినందించారు.

రేపు జాతీయ సదస్సు



నూజివీడు టౌన్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): జాతీయ మెటలర్జీ దినోత్సవాన్ని పురస్కరించుకుని నూజివీడు ట్రిపుల్ ఐటీ మెటలర్జీ, మెటీరియల్ ఇంజినీరింగ్ విభాగం ఆధ్వర్యంలో ఈనెల 14న జాతీయస్థాయి సదస్సును నిర్వహిస్తున్నట్లు ట్రిపుల్‌ఐటీ డైరెక్టర్ అమరేంద్రకుమార్ తెలిపారు. ఈ సదస్సులో జాతీయస్థాయిలో గుర్తింపు పొందిన మెటలర్జీ శాస్త్రవేత్తలు, డైరెక్టర్‌స్థాయి వ్యక్తులు పాల్గొంటారన్నారు. తద్వారా లోహశాస్త్ర రంగంలో ఉన్న అవకాశాలు, వాటికి సంబంధించిన పరిజ్ఞానాన్ని నేటి విద్యార్థులకు తెలియచేసే అవకాశం ఉంటుందన్నారు. ఏవో లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

సీఎం సహాయనిధి చెక్కు అందజేత



కైకలూరు, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): కైకలూరు క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే డాక్టర్ కామినేని శ్రీనివాస్ సీఎం సహాయనిధి చెక్కు పంపిణీ చేశారు. ఇటీవల తామరకొల్లు గ్రామానికి చెందిన పంతగాని సాత్విక్ అనే విద్యార్థి రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డాడు. వైద్య ఖర్చుల నిమిత్తం సీఎం సహాయనిధిని ఆశ్రయించగా రూ.3,84,281లు చెక్కును ఎమ్మెల్యే అందజేశారు. కూటమి నేతలు పూల రామచంద్రరావు, గంగుల ఏసురాజు, కొల్లి వరప్రసాద్, చేబోయిన శ్రీనివాసరావు, పుప్పాల సూర్యప్రకాశరావు, మాజీ సర్పంచ్ కురేళ్ళ ఇస్సాక్, తదితరులు పాల్గొన్నారు. ఆలపాడులోని శ్రీకామాక్షిసమేత మల్లిఖార్జునస్వామిని ఎమ్మెల్యే దర్శించుకొని పూజలు చేశారు.

అభయ మహిళా రక్షక్‌పై అవగాహన



ఆగిరిపల్లి, నవంబరు 12 (ఆంధ్ర జ్యోతి): ఈదర జడ్పీ హైస్కూల్‌లో నందు అభయ మహిళా రక్షక్ ప్రోగ్రాం పై విద్యార్థులకు అవగాహన కార్యక్ర మం నిర్వహించారు. అత్యవసర సమయంలో పోలీస్ సహాయం కోసం 112 నెంబర్ ద్వారా సమాచారం అందించి పోలీసుల సహాయం పొందాలని, బాల్యవివాహాలకు పూనుకుంటే 1098కి సమాచారం అందించాలని ఆగిరిపల్లి ఎస్సై శుభశేఖర్ తెలిపారు. సైబర్ నేరాలకు గురైతే 1930కి సమాచారం ఇవ్వాలన్నారు. అనంతరం విద్యార్థులతో ర్యాలీ నిర్వహించారు. నూజివీడు సీఐ రామకృష్ణ పాల్గొన్నారు.



లక్ష్మీనరసింహస్వామి బ్రహ్మోత్సవాలు

ఆగిరిపల్లి, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): ఆగిరిపల్లిలో కొలువై ఉన్న శ్రీ శోభనాచల వ్యాఘ్ర లక్ష్మీ నరసింహస్వామి వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా మంగళవారం నిత్యహోమం, ధ్వజారోహణ కార్యక్రమం వైభవంగా నిర్వహించారు. బుధవారం నిత్యహోమం, శ్రీవారి శోభనగిరి ప్రదక్షణ జరుగుతుందని భక్తులు పాల్గొనాలని ప్రధాన అర్చకులు వేదాంతం శేషబాబు తెలిపారు.

50 వేలు పైగా బీజేపీ సభ్యత్వాలు

కైకలూరు, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్యే డాక్టర్ కామినేని శ్రీనివాస్ ఆధ్వర్యంలో కైకలూరు నియోజకవర్గంలో 50 వేలకు పైగా బీజేపీ సభ్యత్వాలు నమోదయ్యాయని ఆ పార్టీ కన్వీనర్ వేంపాటి విష్ణురావు అన్నారు. మంగళవారం కైకలూరులో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పార్టీ మండల అధ్యక్షుడు కట్టా వీరరాఘవులు, వేంపాటి గోవింద చంద్రశేఖర్, బొల్లా శ్యామలరాజు, పామర్తి రాంబాబు, మోదుగుముడి లక్ష్మీయ్య, బోడావుల రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

పార్టీని పటిష్ఠం చేయాలి

ముదినేపల్లి: గ్రామస్థాయి నుంచి బీజేపీని సంస్థాగతంగా పటిష్ఠం చేసేందుకు కార్యకర్తలు కృషి చేయాలని ఆ పార్టీ సంస్థాగత రిటర్నింగ్ అధికారి సత్యనారాయణ కోరారు. మంగళవారం పెయ్యేరులో పార్టీ మండల అధ్యక్షు రాలు నాగలక్ష్మి అధ్యక్షతన జరిగిన కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ అంకిత భావం కలిగిన కార్యకర్తలకు కమిటీల్లో స్థానం కల్పిస్తామన్నారు. పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి కోటప్రోలు కృష్ణారావు, నాయకులు పాల్గొన్నారు.




పీజెఎస్ మాల్యాద్రి, అంద్రాజు శ్రీనివాస్

కార్పొరేషన్ సభ్యులుగా మాల్యాద్రి, శ్రీనివాస్

కైకలూరు, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): కైకలూరుకు చెందిన ఆర్యవైశ్య సంఘ ప్రముఖుడు, టీడీపీ రాష్ట్ర వాణిజ్య విభాగం ప్రధాన కార్యదర్శి పీజేఎస్ మాల్యాద్రి ఆర్యవైశ్య కార్పొరేషన్ సభ్యుడిగా నియమితులయ్యారు. అలాగే కలిదిండి మండలానికి చెందిన పార్టీ బీసీ సెల్ రాష్ట్ర కార్యదర్శి అంద్రాజు శ్రీనివాస్‌ను అగ్నికుల క్షత్రియ కార్పొరేషన్ సభ్యుడిగా నియమించారు. వీరు ఎంతోకాలంగా పార్టీ సంక్షేమానికి ఆయా సంఘాల అభివృద్ధికి ఎనలేని కృషి చేశారు. వారిని ప్రభుత్వం గుర్తించి ఆయా కార్పొరేషన్ సభ్యులుగా నియమించడం పట్ల ఎమ్మెల్యే డాక్టర్ కామినేని శ్రీనివాస్, పలువురు కూటమి నేతలు శుభాకాంక్షలు తెలిపారు.

రైతులు అప్రమత్తంగా ఉండాలి

కలిదిండి, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): బంగాళాఖాతంలో అల్పపీడనం ప్రభావంతో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని రైతులు అప్రమత్తంగా ఉండాలని మండల వ్యవసాయాధికారి విద్యాసాగర్ అన్నారు. మంగళవారం తాడినాడలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వర్షాల దృష్ట్యా నాలుగు రోజులపాటు వరి కోతలను నిలుపుదల చేయాలన్నారు. సర్పంచ్ టి.శ్రీనివాసరావు, మత్స్యశాఖ అధికారి రవితేజ తదితరులు పాల్గొన్నారు.

రేపటి నుంచి గ్రంథాలయ వారోత్సవాలు

చాట్రాయి, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చాట్రాయి, చనుబండ శాఖా గ్రంథాలయాలలో 14 నుంచి 20వ తేదీ వరకు 57వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు నిర్వహిస్తున్నట్లు లైబ్రేరియన్ శ్రీకాంత్ తెలిపారు. 14న బాలల దినోత్సవం, 15న పుస్తక ప్రదర్శన, 16న గ్రంథాలయ ఉద్యమ పితామహులను స్మరించుట, 17న కవి సమ్మేళనాలు, 18న విద్యార్థులకు చిత్ర లేఖనం, వ్యాస రచన, వక్తృత్వ క్విజ్ పోటీలు, 19న మహిళలకు రంగవల్లుల పోటీలు, 20న డిజిటల్ గ్రంథాలయాలపై విద్యార్థులకు అవగాహన, వారోత్సవాలు ముగింపు వేడుకలు జరుగుతాయన్నారు.



నియామకపత్రం అందుకున్న మంగయ్య

జిల్లా ఆర్గనైజింగ్ కార్యదర్శిగా మంగయ్య

చాట్రాయి, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): అఖిల భారత ఆదివాసీ ఉద్యోగుల సంఘం జిల్లా ఆర్గనైజింగ్ కార్యదర్శిగా మండలంలోని పోలవరం పోస్టుమాస్టర్ డి. మంగయ్య ఎన్నికయ్యారు. ఇటీవల విజయవాడలో జరిగిన ఎన్నికలో మంగయ్య ఎన్నిక కాగా, జాతీయ నాయకుడు డాక్టర్ దేవరకొండ వెంకటేశ్వరరావు చేతుల మీదుగా మంగయ్య ధ్రువపత్రం అందుకున్నారు. ఆయనను మండలంలోని ఎస్టీ ఉద్యోగులు అభినందించారు.

నగదు, బియ్యం వితరణ

ముదినేపల్లి, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): బ్రెయిన్ ట్యూమర్ ఆపరేషన్ చేయించుకుని విశ్రాంతి తీసుకుంటూ తాపీ పనులకు వెళ్లలేని స్థితిలో ఉన్న గుడివాడకు చెందిన శివనాగ ప్రసాద్ అనే యువకుడికి ముదినేపల్లికి చెందిన ప్రైవేట్ వైద్యుడు డాక్టర్ అంబుల మనోజ్ రూ.5 వేలు నగదు సహాయం, రూ.2 వేల విలువైన నిత్యావసర సరుకులను అందజేశారు. అమరావతి బ్రాండ్ అంబాసిడర్ అంబుల వైష్ణవి కోరిక మేరకు ఆమె తండ్రి మనోజ్ మంగళవారం ఈ సహాయం అందజేశారు.

ఎస్టీయు సభ్యత్వ నమోదు

చాట్రాయి, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రోపాధ్యాయ సంఘం నాయకులు మంగళవారం మండలంలోని పలు పాఠశాలల్లో సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించారు. మండల అధ్యక్ష, కార్యదర్శులు వెదుళ్ళ వెంకటేశ్వరరావు, భరత్ మాట్లాడుతూ ఉపాధ్యాయులకు పెండింగ్ డీఏ విడుదల చెయ్యాలని, ఐఆర్ ప్రకటించాలని డిమాండ్ చేశారు. సంఘం జిల్లా నాయకులు పాల్గొన్నారు.